# శ్రీపాదరాయల
# పదకవితా వైభవం


రచన

**డా॥ కె. సర్వోత్తమరావు**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2017**

# SRIPADARAYALA PADAKAVITHA VAIBHAVAM

*By*

**Prof. K. Sarvottama Rao**

T.T.D. Religious Publication Series No: 1258
© All Rights Reserved

First Edition : 2017

*Copies: 500*

*Published by :*
**Sri Anil Kumar Singhal,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P :*
Office of the Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

## ముందు మాట

కన్నడ వాఙ్మయంలో హరిదాసుల సంకీర్తనసాహిత్యం అత్యంత ప్రధానమైందేగాక, భక్తి ప్రబోధాత్మకమైంది కూడా.

కన్నడభాషలో హరిదాసులు సృజించిన సంకీర్తనవాఙ్మయం "హరిదాస వాఙ్మయంగా" ప్రసిద్ధికెక్కడమేగాక, నాటికీ నేటికీ భక్తలోకాన్ని ఉర్రూత లూగిస్తూనే ఉంది

కర్నాటక హరిదాసులు ఒకరు కాదు, ఇద్దరు కాదు, అనేకులు ఉన్నారు. కొందరు దాసులు గృహస్థులు. మరికొందరు యతులు. ఇంకొందరు ఆశ్రమ పీఠాధిపతులుగా కూడ ఉన్నారు. ఎవరు ఏ ఆశ్రమంలో ఉన్నా, భగవంతుణ్ణి సంకీర్తన చేస్తూ, ప్రచారం చెయ్యడమే ఆ హరిదాసుల ప్రధాన ధ్యేయం.

అలాంటి హరిదాసుల్లో ప్రముఖంగా పేర్కొన దగినవారుశ్రీపాదరాయలు. వీరి పూర్వనామం లక్ష్మీనారాయణులు. బాల్యంలోనే సన్యాసం స్వీకరించారు. వీరే 'శ్రీపాదరాయలు'గా ప్రసిద్ధి పొందారు. శ్రీ పాదరాయలవారి శిష్యులే వ్యాసతీర్థులవారు. వ్యాసరాయలవారు పండ్రెండేండ్లపాటు తిరుమల ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని స్వయంగా అర్చించినట్లు చరిత్ర ప్రసిద్ధి.

ఇలా శ్రీపాదరాయలవారి సంక్షిప్త చరిత్రతో పాటు, వారు రచించి గానం చేసిన కన్నడ సంకీర్తనలను గూర్చి పరిచయం చేస్తున్న చిన్న పొత్తమే "శ్రీ పాదరాయల పదకవితా వైభవం"

డా॥ కె. సర్వోత్తమరావుగారు శ్రీపాదరాయల సంకీర్తనలను పలురకాలుగా వింగడించి విశ్లేషణాత్మకంగా అందించిన "శ్రీపాదరాయల

పదకవితా వైభవం" గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక ప్రచురణగా అందిస్తున్నది. పాఠకులు చదివి సద్వినియోగం చేసుకొనగలరని ఆకాంక్షిస్తూ.....

*సదా శ్రీవారి సేవలో*



కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి

# వినతి

తెలుగుకన్నడభాషలమధ్య ఎన్నో సామ్యాలున్నాయి. ఈ రెండుభాషల అనుబంధాన్ని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు 'ఒకే వాహినియం దుద్భవించిన రెండుపాయల వలెను – ఒకే కొమ్మను పూచిన రెండు పూవుల వలెను, ఒకే గర్భమున బుట్టిన కవలలవలెను' అని భావించారు. ఈ విధంగా భావించడానికి వారు ఎనిమిది కారణాలు చూపారు. వాటిలో ప్రధానమయినవి రాజకీయముగ, ఈ దేశముల రెండింటిని ఒకే వంశము రాజులు పరిపాలించడం, ఆలాగే సాంఘికంగా మతవిషయకంగా సంబంధం దృఢతరం కావడం.

ఈ నేపథ్యంతో పరిశీలిస్తే తెలుగు కన్నడభాషలలో 'పదసాహిత్యం' నర్మదా తపతుల లాగా సమాంతరంగా సాగిందనవచ్చు. తెలుగులో కృష్ణమాచార్యులలాగే కన్నడంలో నరహరితీర్థులూ; మరియు కన్నడంలో శ్రీపాదరాయలలాగే తెలుగులో అన్నమయ్యాదులూ రచనలు చేశారు. అన్నమయ్య క్రీ.శ.1408 – 1503 నాటివాడయితే శ్రీపాదరాయలు క్రీ. 1412 – 1502 నాటివాడు. ఇరువురికి హంపీపాలకుడయిన సాళ్వనరసింహరాయలతో ప్రత్యక్షపరోక్ష అనుబంధాలున్నాయి.

హంపీ విజయనగరపాలకుల కాలంలో తిరుమల వైభవం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. తెలుగువారికి ఇలవేల్పు శ్రీ వేంకటేశ్వరు డయినట్లే, కన్నడిగులు కూడ 'దేవరందరె తిమ్మప్ప' (దేవుడంటే తిరుమలేశుడే) అని త్రికరణ శుద్ధిగా విశ్వసించారు. శ్రీపాదరాయలు ఆదిగా కన్నడపదకవులు తిరుమలను దర్శించడం కాకుండా అక్కడి ఉత్సవాదులను తిలకించి తన్మయత్వంతో కీర్తించారు.

తెలుగులో అన్నమయ్యాదుల కీర్తనలనిర్మాణరచనకు శ్రీపాదరాయల 'పదాలు' ప్రోత్సాహకాలని శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు అనేక వ్యాసాలలో తమ అభిప్రాయాలను

ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలుగులో శ్రీపాదరాయల గురించి ఒక చిరుపొత్తం వ్రాయాలనిపించింది.

ఆంధ్ర తెలంగాణాది ప్రాంతాలలో కన్నడిగులు లక్షలసంఖ్యలో ఉన్నా, వారిలో చాలమందికి కన్నడభాషా పరిచయముంది గానీ కన్నడలిపితో గాని, కన్నడ సాహిత్యానుబంధం గానీ చాలా తక్కువే అని చెప్పవచ్చు. ఆ దృష్టితో నేను లోగడ 'పురందర పదసాహిత్య సౌరభము' అనే పుస్తకాన్ని ముద్రించి సాహిత్యప్రియులకు ఉచితంగానే పంచాను. ఆ సందర్భంలో పదకవిత్వంపట్ల అనురక్తి కలవారు 'శ్రీపాదరాయల' గురించి తెలుగులో ప్రామాణికమయిన చిరుపుస్తకం వెలువడడం అవసరమని చాలాసార్లు నాకు సూచించారు. నాలోని సహజమయిన పదసాహిత్యానురక్తికి సాహిత్యాభిమానుల ప్రేరణ తోడు కావడంతో ఈ రచన చేపట్టాను.

ఈ చిరుపుస్తకం యతీ, గాయకుడు అయిన ఒక కర్నాటక హరిదాసు చరిత్ర కనుక, తిరుమల తిరుపతి దేవస్థానంవారే తమ స్వీయ ప్రచురణగా ముద్రిస్తే బాగుంటుందని అభ్యర్థించాను. నా విన్నపంమేరకు, దేవస్థానం ప్రచురణగా వెలువడుటకు ఆమోదింప జేసిన శ్రీ ప్రయాగరామకృష్ణ, ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం గారికి నమస్సులు.

ఈ గ్రంథం వెలువడడానికి సహకరించిన వారికందరికీ నా కృతజ్ఞతలు.

**తిరుపతి** — కె. సర్వోత్తమరావు
**మహాశివరాత్రి' 17**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| **1.** | **శ్రీపాదరాయల జీవనరేఖలు** | ----- | **1** |
| 1.1. | శ్రీస్వర్ణవర్ణతీర్థుల అనుగ్రహం | ----- | **2** |
| 1.2. | శ్రీరఘునాథతీర్థుల ప్రశంస | ----- | **5** |
| 1.3. | ముళబాగిలు వాసం | ----- | **7** |
| **2.** | **శ్రీపాదరాయల కీర్తనలు** | ----- | **9** |
| 2.1. | అధ్యాత్మ కీర్తనలు | ----- | **9** |
| 2.1.1. | క్షేత్రప్రస్తుతి కీర్తనలు | ----- | **10** |
| 2.1.1.1 | శ్రీరంగ కీర్తనలు | ----- | **10** |
| 2.1.1.2. | తిరుమలేశుని కీర్తనలు | ----- | **11** |
| 2.1.2. | ఆర్తి నివేదనాత్మక సంకీర్తనలు | ----- | **12** |
| 2.1.2.1 | గతజన్మచింతన | ----- | **12** |
| 2.1.2.2. | ఆత్మనింద | ----- | **13** |
| 2.1.2.3. | సంప్రార్థన | ----- | **14** |
| 2.1.2.4. | ఆర్తి ప్రకటన | ----- | **14** |
| 2.1.3. | ఇతరములు | ----- | **16** |
| 2.1.3.1. | శ్రీలక్ష్మీనృసింహ ప్రాదుర్భావ దండకం | ----- | **16** |
| 2.1.3.2. | 'మధ్వనామ' | ----- | **17** |
| 2.1.3.3. | శ్రీరఘునాథతీర్థుల ప్రస్తుతి | ----- | **18** |
| 2.2. | శ్రీకృష్ణ సంకీర్తనలు | ----- | **19** |
| 2.2.1 | వాత్సల్య కీర్తనలు | ----- | **19** |
| 2.2.1.1. | మాతృగతం | ----- | **19** |

2.2.1.2. గోపికాగతం ----- 21

2.2.1.3. బాలకృష్ణాత్మక కీర్తనలు ----- 23

2.3. శృంగార సంకీర్తనలు ----- 25

2.3.1. వేణుగీతాలు ----- 26

2.3.2. విరహగీతాలు ----- 27

2.3.3. జానపదీయాలు ----- 28

**3. శ్రీపాదరాయల కృతులలో కవితాంశాలు ----- 31**

3.1. కీర్తనలలో సంవాదాత్మక రచన ----- 33

3.2. 'భ్రమరగీతె'లో కవితాంశాలు ----- 41

3.3. ఇతరములు ----- 42

**4. శ్రీపాదరాయల కీర్తనలలో సందేశాలు ----- 43**

4.1. సన్యాసులపై చురక ----- 43

4.2. వైష్ణవులకు సందేశం ----- 44

4.3. భంగ్యంతర సందేశం ----- 45

4.4. సూటిగా సందేశం ----- 45

4.5. సామాన్యులకు సందేశం ----- 46

4.6. సందేహ నివృత్తి ----- 47

4.7. మతసందేశం ----- 48

4.8. ఆత్మవిశ్వాసం పెంచడం ----- 48

**5. శ్రీపాదరాయల కీర్తనలలో సంగీతాంశాలు ----- 49**

5.1. కీర్తన నిర్మాణం ----- 49

5.2. అంకితపదం: (మకుటం) ----- 50





5.3. నామాంకిత కీర్తనలు ----- 50

5.4. రాగతాళాంశాలు ----- 51

5.5. జానపదాంశాలు ----- 51

5.6. ఇతరాంశాలు ----- 52

**అనుబంధం - 1 ----- 54**

శ్రీపాదరాయల ప్రసిద్ధ కీర్తనలు ----- 54

**అనుబంధం - 2 ----- 61**

సహాయక సాహిత్యం ----- 62


* * *

**వాదిరాజమస్తకాంకుశ సుజనబుధగేయ**
**మేదినీసురవంద్య శ్రీపాదరాయ**

**సిరికృష్ణ దివ్యపాదాబ్జ చింతాలోల**
**వరహేమవర్ణ మునిపతియ సుకుమార**
**గురుతిలక శ్రీపాదరాయ అమితోద్ధార**
**శరణజనసురధేను భక్తమందార**

* * *

# శ్రీపాదరాయల జీవనరేఖలు

**మనెయింద సంతోష కెలవరిగె లోకదల్లి**
**ధనదింద సంతోష కెలవరిగె లోకదల్లి**
**వనితెయిం సంతోష కెలవరిగె లోకదల్లి**
**తనయరిం సంతోష కెలవరిగె లోకదల్లి**
**ఇనితు సంతోష అవరవరిగాగలి నిన్న**
**నెనవో సంతోష ఎనగాగలి నమ్మ రంగవిఠల!**

"మా రంగవిఠల! ఈ లోకంలో కొందరికి గృహవాసమే సంతోష దాయకం. వారికి ఇల్లే వైకుంఠం. కొందరికేమో పొద్దస్తమానం డబ్బు చింత. డబ్బు ఎలా సంపాదించాలనే తాపత్రయం. అంతేకాదు సంపాదించిన డబ్బును ఎలా దాచుకోవాలో? అనే బెంగ. సమస్తసుఖాను భవాలు డబ్బువల్లే సాధ్యమని వారి నిశ్చితాభిప్రాయం. మరికొందరికి వనితాజనదర్శనం. వారితో సహవాసం, సుందరీజన కోమలులతో సాంగత్యాలే ముచ్చటలు. ఇంకా కొందరికి కన్నబిడ్డలే సర్వస్వం. పోనీ వారి వారి సంతోషం వారి వారికే ఉండనీ! నిన్ను స్మరించే, ధ్యానించే, ఆలోచించే, మననం చేసే సంతోషం నాకుండనీ" అని తన చుట్టూ ఉన్న సామాజిక జీవనాన్ని కళ్ళారా చూచి తనకంటూ ఒక జీవన విధానాన్ని ఏర్పరచుకొని సకలజన వందనీయులైన మఠాధిపతులు శ్రీపాదరాయలు.

శ్రీపాదరాయలవారి జీవితవిశేషాలు తెలుసుకోవడానికి శ్రీవ్యాసరాయల కీర్తనలు, పంచరత్నమాలాస్తుతి – శ్రీనిధితీర్థుల శ్రీపాదరాయాష్టకం, విజయదాసుల "సుళాది' కీర్తనలు, భీమాచార్యుల శ్రీపూర్ణబోధగురువంశ కల్పతరు, మరి ప్రజానీకంలో వ్యాప్తిలో ఉన్న కథలు ఆధారాలు.

## 1.1. శ్రీశ్రీశ్రీస్వర్ణవర్ణతీర్థుల అనుగ్రహం

పూర్వాశ్రమంలో శ్రీపాదరాయలు లక్ష్మీనారాయణ నామధేయులు. వారి తల్లిదండ్రులు గిరియమ్మ శేషగిరియప్పలు. గిరియమ్మ సొంతగ్రామం బెంగళూరు జిల్లా, చన్నపట్టణతాలూకా, అబ్బూరు గ్రామం. వీరి జనన సంవత్సరం క్రీ.శ.1402. ఆ గ్రామంలో ప్రసిద్ధులు బ్రహ్మణ్యతీర్థులు. బ్రహ్మణ్యతీర్థుల తల్లి, శ్రీపాద రాయలతల్లి అక్కాచెల్లెండ్రు. ఆ కారణంవలన లక్ష్మీనారాయణుల బాల్యం అక్కడే గడిచింది.

శేషగిరియప్ప సామాన్యకుటుంబికుడు. ధనవంతుడు కాడు. కాసంత పొలం, పశుసంపదలే అతని ఆస్తిపాస్తులు. అందుచేత లక్ష్మీనారాయణులు రోజూ పశువులను మేపడానికి వెళ్ళేవాడు.

ఒకసారి మిత్రులతో లక్ష్మీనారాయణ గ్రామం పొలిమేర్లలో ఆవులు మేపుతున్నాడు. అప్పుడే ఒక పల్లకీ అటుకేసి వెళుతున్నది. ఆవులు మేపే వారంతా కళ్లు ఇంతింతలు చేసుకొని చూస్తున్నారు. 'మేనా' ఆగింది. మేనాలోని వ్యక్తి బయటికి తలచాచి లక్ష్మీనారాయణుల్ని చూచి –

'బాలకా! ఇక్కడికి అబ్బూరు ఎంత దూరం?' అని అడిగారు.

'అయ్యా! నన్ను తేరిపార చూడండి. ఇంటికేసి తిరుగుమొగం పట్టిన ఆవుల్ని చూడండి. అంతేకాదు. పడమటి వేపు క్రుంగే వృద్ధసూర్యుని చూడండి' అన్నాడు.

మేనాలోని వ్యక్తి ఆశ్చర్యపడ్డారు. బాలుడయినా సూర్యాస్తమయం గురించి చెప్పిన విధానం ఆశ్చర్యపరవశుల్ని చేసింది. గ్రామం దగ్గరలోనే అనడాన్ని ధ్వనిపూర్వకంగా చెప్పాడు కదా! అని తెగ సంతోషపడ్డారు.



'బాలకా! చాలా బాగా చెప్పావు. ముద్దుగా ఉన్నావు. రా!రా! మేనా ఎక్కు క్షణంలో మీ ఊరు చేరుకొందాం. నీవు మాకు అబ్బూరికి దారి చూపుదువుగాని. రా! రా!' అన్నారు.

'అయ్యా! మీకో నమస్కారం! మీ మేనా వాహనానికి మరో నమస్కారం! మీతో రావడమా? ఈ మధ్యనే మీలాగే ఒక స్వామి మా ఊరొచ్చి మా పెద్దమ్మ కొడుక్కి సన్యాసం ఇప్పించారు. చాలక తమ వెంట తీసికెళ్ళారు. అనుకోని సంఘటనకు మా ఇంటిలోని వారంతా అవాక్కయ్యారు. ఇంకా తేరుకోలేదు. ఇలాంటి పరిస్థితులలో మీతో వస్తే అంతే! మా తల్లిదండ్రులు దిగాలుపడిపోతారు' అన్నాడు.

'ఓహో! ఆలాగా! మీ పెద్దమ్మ కొడుక్కి సన్యాసం ఇప్పించిన గురువులెవరు?' ప్రశ్నించారు కుతూహలంతో మేనాలోని యతులు.

'ఏం? తెలుసుకోవాలని ఉందా? మా గురువులే. పురుషోత్తమతీర్థులు. వారంటే మాకు గౌరవం. వారి మాట మావారికంతా సుగ్రీవాజ్ఞ' అన్నాడు.

మేనాలోనివారు శ్రీస్వర్ణవర్ణతీర్థులు. పద్మనాభతీర్థుల మఠాధిపతులలో ఏడవ వారు. శ్రీరంగపట్టణం దగ్గరి కావేరీనదీ స్నానార్థం వచ్చారు. అబ్బూరు ప్రాంతం లోని పురుషోత్తమతీర్థుల ప్రసిద్ధి విని వారిని దర్శించాలనుకొని పయనం కట్టారు.

సరాసరి స్వర్ణవర్ణతీర్థులు పురుషోత్తమతీర్థుల ఆశ్రమం చేరుకొన్నారు. వారి ప్రక్కనే బ్రహ్మతేజంతో విరాజిల్లుతున్న శ్రీ బ్రహ్మణ్యతీర్థులను చూచి ఆశ్చర్యపడ్డారు.

'యతివర్యా! ఇలాంటి చురుకయిన వ్యక్తి మా సంస్థానానికి దక్కితే ధన్యులం' అంటూ తమ అభిలాషను బహిరంగంగా ప్రకటించారు.

పురుషోత్తమతీర్థులు సావధానంగా విన్నారు.

'దైవాజ్ఞ అయితే ఇక్కడే మీ కోరిక నెరవేరవచ్చు' అన్నారు నవ్వుతూ –

స్వర్ణవర్ణతీర్థులు పరవశించారు. అంతేకాదు తాము అబ్బూరుకు మేనాలో వస్తున్నవేళ దారిలో ఒక బాలకుని చూచిన వైనం, ఆ బాలునితో మాటలాడిన వైనం అంతా విశదం చేసి ఆ బాలుని తెగపొగడడం మొదలెట్టారు.

పురుషోత్తమతీర్థులు మనసా ఆ బాలకుడెవరో గుర్తించారు. వెంటనే గిరియమ్మ శేషగిరియప్ప దంపతులను ఒకసారి మఠానికి వెంటనే రావలసిందిగా కబురంపారు.

మఠాధిపతుల కబురు వినగానే గిరియమ్మ శేషగిరియప్పలకు దిక్కు తోచ లేదు. గుండెల్లో రాయి పడ్డట్టయింది. అప్పటికే లక్ష్మీనారాయణ ఆవులు మేపుతుండగా జరిగిన 'మాటామంతీ' అంతా చెప్పడంవల్ల 'ఏం అపచారం జరిగిందో?' అని కొడుకుతోబాటు మఠానికి దారి తీశారు.

పురుషోత్తమతీర్థులు దంపతులను దగ్గరికి రమ్మన్నారు. మఠంలో పురుషోత్తమ తీర్థులు. పక్కనే స్వర్ణవర్ణతీర్థులు. మఠంలో అడుగుపెట్టగానే స్వర్ణవర్ణతీర్థుల దృష్టి పసిబాలునిపై పడ్డది.

'శేషగిరి! నీ కుమారుని బుద్ధికుశలత విని ఆశ్చర్యపడ్డాం. చాలా సంతోషం. చూడు! మీ అబ్బాయికి బ్రహ్మోపదేశం చేసే వయస్సు కదా! మీ అబ్బాయి బ్రహ్మోపదేశదీక్షకు, ఆలాగే విద్యాభ్యాసానికి శ్రీరంగం నుండి వచ్చిన స్వర్ణవర్ణ తీర్థులవారు సంసిద్ధులుగా ఉన్నారు. ఏమంటావ్! మీ అబ్బాయి ముఖవర్చస్సు అసాధారణం. భవిష్యత్తులో మహాతేజస్విగా, ప్రతిభాసంపన్నుడుగా రాణిస్తాడని పిస్తుంది. ఇది కేవలం నా అభిప్రాయం మాత్రం కాదు. స్వర్ణవర్ణతీర్థుల అభిప్రాయం కూడా. వారు నీ కుమారునికి బ్రహ్మోపదేశం మాత్రం కాదు తమ శిష్యులుగా స్వీకరించి విద్యాబుద్ధులు



నేర్పుతారు. తన మఠానికి మీ కుమారుని ఉత్తరాధికారిగా నియమించాలని కూడా వారు భావిస్తున్నారు. అయినా! శేషగిరీ! ఆలోచించు. నీ భార్య గిరియమ్మతో చర్చించి నిర్ణయం తీసుకో' అన్నారు.

శేషగిరియప్ప గతుక్కుమన్నాడు. ఆ రోజుల్లో రాజాజ్ఞకన్నా మఠాధికారానికి విలువ హెచ్చు. అంతేగాక పురుషోత్తమతీర్థులు పరిచితులు. తన కుమారుని పట్ల శ్రద్ధగలవారు. త్రికాలవేదులు. అంచేత ఏలాగో ఆలాగ భార్యను ఒప్పించ గలిగారు.

అయినా శేషగిరియప్పకు ఒక సందేహం వెంటాడుతూ ఉంది.

"స్వామీ! మీ ఆన జవదాటే వాళ్ళం కాము. అయినా ఒక వినతి. మేము ముసలివాళ్లం. మాకు ఈ బిడ్డే దిక్కు. ఈ కానకకన్న సంతానాన్ని మీకు అప్పగిస్తే వృద్ధాప్యంలో మా గతేమిటి?" అన్నాడు నసుగుతూ శేషగిరియప్ప.

'ఆలాగా! దిగులు పడకండి. స్వర్ణవర్ణులవారే అనుగ్రహించాక మీకు కొదవేం? మీరు భాగ్యశాలురు. వారి 'ఉదార ఆశ్రమంలో మీరూ కృతార్థులు కావచ్చు' అన్నారు.

అన్నీ సవ్యం అయ్యాక స్వర్ణవర్ణతీర్థులు లక్ష్మీనారాయణులతో గిరియమ్మ శేషగిరి దంపతులతో శ్రీరంగం కదలి వెళ్ళారు.

## 1.2. శ్రీశ్రీశ్రీ రఘునాథతీర్థుల ప్రశంస

స్వర్ణవర్ణతీర్థులు తమ వాగ్దానాన్ని మరచిపోలేదు. లక్ష్మీనారాయణులకు ఉపనయనసంస్కారం నిర్వహించారు. విద్యలు నేర్పారు. **'క్షిప్ర'**లోనే సన్యాసదీక్ష ప్రసాదించారు. వాగ్దానం మేరకు తన మఠానికి ఉత్తరాధికారిని

చేశారు. అంతేకాదు తనకాలంనాడు ద్వైతవేదాంతంలో ప్రవీణులయిన 'విబుధేంద్రతీర్థుల' వారి దగ్గరికి విద్యాగ్రహణార్థం శిష్యునిగా పంపారు. వారి గురుత్వంలో లక్ష్మీనారాయణులు క్షుణ్ణంగా ఆ వేదాంతాన్ని ఆకళింపు చేసుకొన్నారు.

ఒకసారి విబుధేంద్రతీర్థులవారు తమ శిష్యులతో 'కొప్ర' గ్రామానికి వెళ్ళారు. అది నారసింహక్షేత్రం. ఆ క్షేత్రంలో బసచేసినవేళ ఒకసారి ఉత్తరాదిమఠాధిపతులు శ్రీరఘునాథతీర్థులవారు తీర్థయాత్ర చేసుకొంటూ అక్కడికి విచ్చేశారు.

విబుధేంద్రతీర్థులవారు రఘునాథతీర్థులవారితో –

'యతివర్యా! మీరు ఈ బాలసన్యాసిని విద్యాపరీక్ష చేయండి. ఆశీర్వదించండి' అన్నారు.

'యతిశ్రేష్ఠా! మీ దగ్గర సాంగోపాంగంగా విద్యలు నేర్చుకొన్న శిష్యుణ్ణి నేను పరీక్షించడమా? అయినా ఒక విద్వత్పరీక్ష పెడదాం' అన్నారు.

మరుసటిరోజే 'విద్వత్పరీక్ష'కు సన్నాహాలు పూర్తి అయ్యాయి.

'బాలయతీ! టీకాచార్యుల 'సుధాగ్రంథాన్ని' చదివి వ్యాఖ్యానించు' అన్నారు రఘునాథతీర్థులవారు.

'అలాగే! తమ ఆజ్ఞ' అంటూ క్లిష్టమయిన భాగాన్ని ఎంపిక చేసుకొని మహాద్భుతంగా లక్ష్మీనారాయణతీర్థులు వ్యాఖ్యానం చేశారు. విబుధేంద్రులు విస్మితు లయ్యారు.

శ్రీరఘునాథతీర్థులవారు పరవశించారు. గుణగ్రాహులయిన యతీంద్రులు తమ ఆనందాన్ని బాహాటంగానే వ్యక్తం చేశారు.



మీలాంటి శ్రీపాదుల ప్రశంసలు పొందడం నా అనుగ్రహం' అన్నారు లక్ష్మీనారాయణులు. రఘునాథతీర్థులు సంతోషంతో – మీరు 'శ్రీపాదరాజరు' అన్నారు ముక్తసరిగా.

లక్ష్మీనారాయణతీర్థుల జీవనంలో ఇదొక శుభదినం. ఆనాటినుండి వీరికి **'శ్రీపాదరాజరు, శ్రీపాదరాయ'** బిరుదం రూఢి అయింది.

తదనంతరం శ్రీపాదరాయలు విబుధేంద్రతీర్థులవారి దగ్గర ద్వైతగ్రంథాలను మరింత లోతుగా అధ్యయనం చేసి మరల తన్ను మన్నించిన స్వర్ణవర్ణతీర్థులవారి దగ్గరికి చేరుకొన్నారు. కాలాంతరంలో స్వర్ణవర్ణ తీర్థులవారు బృందావనస్థులయితే లక్ష్మీనారాయణులే (శ్రీపాదరాయలే) ఉత్తరాధికారులయ్యారు. ఆపై దేశసంచారం చేస్తూ శ్రీరంగంలో కొంతకాలముండి చివరకు కోలారుజిల్లాలోని 'ముళబాగిలు' చేరుకొన్నారు.

### 1.3. ముళబాగిలు వాసం

'ముళబాగిలు' తిరుపతి – పలమనేరు – బెంగుళూరు రహదారిలో కోలారు జిల్లాలోని ఒక చిన్నపట్టణం. విజయనగర సామ్రాజ్యకాలంలో అతి ముఖ్యమయిన కేంద్రంగా వర్ధిల్లిన చోటు. అంతేకాదు పరిశోధకులలో కొందరు ఈ 'ముళబాగిల్'నే శ్రీపాదరాయల తండ్రి జీవించిన ప్రదేశంగా భావించారు. 'అక్షోభ్యతీర్థరు' విద్యారణ్యులవారితో వాదమాడిన స్థలమని కూడా ప్రసిద్ధి. అంతేకాదు యోగనరసింహస్వామి ఆలయమున్న పవిత్రక్షేత్రం. శ్రీపాదరాయలవారు వృద్ధాప్యంలో ఒకసారి గంగాస్నానం చేయదలచుకొన్నారట. కాని, వయసు ఉడిగిపోయింది. తన కోరిక తీరే మార్గం లేదుకదా! అని మనసా బాధపడుతుంటే 'గంగా' నది సాక్షాత్కరించిం దట. అదే నరసింహతీర్థం. అంతటి పావనక్షేత్రాన్ని ఎంపిక చేసుకొని మఠాన్ని స్థాపించి ధార్మికప్రచారం చేసిన మహానుభావులు.

శ్రీపాదరాయల శిష్యపరంపర తక్కువేమీ కాదు. విస్తృతం. వారిలో 'వ్యాసరాయ' లొకరు. వ్యాసరాయలు ఒకసారి బ్రహ్మణ్యతీర్థుల దగ్గర విద్యలు నేర్చి తత్త్వార్థియై శ్రీపాదరాయల దగ్గరికి వచ్చారు. అతణ్ణి శ్రీపాదరాయలు తమ శిష్యులుగా చేర్చుకొన్నారు. శిష్యుని బుద్ధికుశలతకు శ్రీపాదరాయలు మురిసి పోయారు.

**'సాసిర జిహ్వెయుళ్ళ శేషనే కొండాడబేకు**

**వ్యాసమునిరాయర సన్యాసదిరవ'** అనే కీర్తనలో సన్యాసులెవరయినా గానీ వ్యాసరాయలకు సాటిరారని, వేయినాలుకల ఆదిశేషుడే వ్యాసరాయలను నుతించాలని మనసారా ప్రశంసించారు. ఈ ప్రశంసలకు ఉబ్బిపోక వ్యాసరాయలు కూడా తమ గురువులయిన శ్రీపాదరాయల వారిని –

**'వాదిగజమస్తకాంకుశ సుజనబుధగేయ**
**మేదినీ సురవంద్య శ్రీపాదరాయ!'**

అని వినుతించి తమ వినయాన్ని చాటుకొన్నారు.

అంతేకాదు తిరుమలలో కారణాంతరాలవల్ల పూజాదికాలకు అవరోధాలు ఏర్పడ్డాయి. అపుడు సాళ్వనరసింహరాయలు శ్రీపాదరాయల వారిని ఆశ్రయించారు. శ్రీపాదరాయలవారు తిరుమల శ్రీవారి కైంకర్యార్థం వ్యాసరాయలనే తన ప్రతినిధిగా పంపారు. వ్యాసరాయలు తిరుమలకు విచ్చేశారు. 12 సంవత్సరాలు శ్రీవారికి కైంకర్యం చేశారు. ఆపై అప్పటివరకు పూజాదికాలు నిర్వహిస్తున్న వైఖానస కుటుంబంలోని 12 ఏళ్ళవాడయిన వైఖానసునికి శ్రీవారి కైంకర్యబాధ్యతను అప్పగించి హంపీ వెళ్ళిపోయారు. ఈ అంశాన్ని ధ్రువపరచే అంశాలున్నాయి. వానిలో ప్రసిద్ధమయినది శ్రీపాదరాయాష్టకం. అందులోని ప్రసిద్ధ శ్లోకం –



**నమ్యద్వీర నృసింహనామనృపతే ర్భూదేవహత్యావ్యథాం**
**దూరీకృత్య తదర్పితోజ్జ్వల మహాసింహాసనే సంస్థితః**
**సేవ్యేపూర్వ కవాట నామకపురే సర్వేష్ట సిద్ధిప్రదః**
**సః శ్రీపాదయతీశ్వరః ప్రతిదినం భూయా ద్భుహుశ్రేయసే ।**

శ్రీపాదరాయల వ్యక్తిత్వం మహోన్నతం. సదాలోచన, సచ్చరిత్ర, సరళ జీవనం, సద్గుణాలు మూర్తీభవించిన వ్యక్తిత్వం. మఠాదులలో పూజా సమయంలో తొలిసారిగా కన్నడకీర్తనలకు ప్రాధాన్యమిచ్చిన మహామహులు. వారు క్రీ.శ. 1502లో జ్యేష్ఠ శుద్ధ దశమినాడు శ్రీపతి పాదారవిందం చేరారు. వారి బృందావనం ఈనాటికి ముళబాగిలులో దర్శనీయం. భక్తులకు వరాలిచ్చే కల్పవృక్షం.

## 2. శ్రీపాదరాయల కీర్తనలు

శ్రీపాదరాయలు తన జీవితకాలంలో అసంఖ్యాకకీర్తనలు పాడి ఉండవచ్చు. వారెన్ని కీర్తనలు వ్రాశారో తెలియడానికి ఆధారాలు కూడా లేవు. ఈ రంగంలో అనితరసాధ్యమైన కృషి సల్పిన డా॥ వరదరాజురావుగారు కర్ణాటాంధ్రప్రాంతాలలో ఓపికతో తిరిగి అనేక తాళపత్రాలు, కాగితపు ప్రతులు సంశోధించి లభ్యమయిన కీర్తనలను 5 రకాలుగా వింగడించి ప్రకటించారు. వారి లెక్కప్రకారం ఖచ్చితంగా నిరూపించగలవి 61. పాఠప్రభేదం కలవి 2, అంకితసందిగ్ధం కలవి 6. ఏకైక ఆకరం కలవి 28, అధికకృతులు 4. ప్రధానంగా ఈ కీర్తనలను ఆధ్యాత్మికకీర్తనలని, శృంగార కీర్తనలని రెండురకాలుగా వర్గీకరించవచ్చు.

### 2.1. అధ్యాత్మ కీర్తనలు

శ్రీపాదరాయల కీర్తనలను క్షేత్రప్రస్తుతికీర్తనలు, ఆర్తి నివేదనాత్మక కీర్తనలు, ఇతరములని ఒక భాగంగా వింగడించవచ్చు.

## 2.1.1. క్షేత్రప్రస్తుతి కీర్తనలు

సామాన్య మానవుల జీవితాలలో లాగే సన్యాసుల జీవితాలలోను తీర్థక్షేత్ర సందర్శనాదులు ఒక భాగం. ఈ కారణంతో శ్రీపాదరాయలు తమ సుదీర్ఘజీవితంలో అసంఖ్యాక క్షేత్రాలను దర్శించి ఉండవచ్చు. ఆ క్షేత్రాధిదేవతలను స్తుతించి ఉండవచ్చు. కాని లభ్యమయిన శ్రీపాదరాయల కీర్తనలలో రెండే క్షేత్రాలు – శ్రీరంగం, తిరుపతి మాత్రమే కనిపిస్తున్నాయి.

### 2.1.1.1 శ్రీరంగ కీర్తనలు

దక్షిణభారతదేశంలోని పుణ్యక్షేత్రాలలో 'శ్రీరంగం' తలమానికం. ఆళ్వారులు, ఆచార్యపురుషులు, కన్నడహరిదాసులు, మఠాధిపతులు అందరు ఈ క్షేత్రాన్ని దర్శించినవారే. ఆలాగే ప్రముఖంగా శ్రీపాదరాయలు అనేక కీర్తనలలో శ్రీరంగనాథుని, శ్రీరంగక్షేత్రాన్ని, అక్కడి ఉత్సవాలను తన్మయత్వంతో కొండాడినవారు. ఆ కీర్తనలలో ప్రముఖమయినవి.

**రంగనాథన నోడువ బన్ని శ్రీరంగన**
**(శ్రీరంగని, రంగనాథుని చూద్దాం రండి)**
**రక్షమాం రంగేశ! రవికోటి సంకాశ**
**(స్వామి రంగేశ! రవికోటిసంకాశ! మమ్ము రక్షించు)**
**శ్రీరంగవిఠలన శ్రీమకుటకె శరణు (శ్రీరంగవిఠలుని కిరీటానికి శరణు)**
**ఇక్కోనోడె రంగనాథనె (ఇదిగో రంగనాథుని తేరిపార చూడండే)**
**కంగళిద్యాతకో కావేరి రంగన నోడదె (కావేరిరంగని చూడని కళ్ళు కళ్లెందుకు?)**

శ్రీపాదరాయలు శ్రీరంగనాథుల బ్రహ్మోత్సవాలను, తిరువీథుల ఉత్సవాలను దర్శించినట్లు కింది పంక్తులు సాక్ష్యమిస్తున్నాయి.



**'అండజ హనుమర భుజదొళిప్పువ పాదవ**
**కండనె రంగవిఠలన దివ్యపాదవ'**

పై పంక్తులబట్టి శ్రీవైష్ణవాలయాలలో ప్రధానమయిన గరుడ, హనుమద్వాహనసేవలను తిలకించినట్లు స్పష్టం. అలాగే –

**'హార హీర వైజయంతి**
**తోరముత్తిన సరవ ధరిసి**
**తీరనేరి బీదిలి**
**మెరవ రంగవిఠలన నోడి' –**

పంక్తులబట్టి తిరువీథుల ఉత్సవాదులను కూడా వారు దర్శించారనవచ్చు. తాను దర్శించడం కాకుండా తమ ప్రజల్ని, తమ ప్రాంతంవారిని, తమ భాష మాట్లాడే వారిని ఆహ్వానించడం శ్రీపాదరాయల వారి ప్రత్యేకత.

### 2.1.1.2. తిరుమలేశుని కీర్తనలు

'కలౌ వేంకటనాయకః'. కలియుగంలో వేంకటేశ్వరుడే సర్వజగద్రక్షకుడు. ఆళ్వారులు పదిమంది అనేక పాశురాలతో 'తిరువేంగడముడైయాన్' ను కీర్తించిన వారే. శ్రీపాదరాయల కీర్తనలరాశిలో వేంకటేశ్వరాత్మక కీర్తనలు కొన్ని కనిపిస్తున్నాయి

**భూషణకె భూషణ ఇదు భూషణ**
**శేషగిరివాస శ్రీవర వెంకటేశ**

**జయతు దోషవినాశ జయ మహిమావిశేష**
**జయతు లకుమీపరితోష జయ శ్రీవేంకటేశ**

అలాగే మరో కీర్తన –

**హరే వేంకటేశ వల్లభ**

**పొరెయ బేకు ఎన్న**

'హరీ! వేంకటేశ! నా పాలిటి వల్లభా! నన్ను తప్పక కాపాడవయ్యా!

### 2.1.2. ఆర్తి నివేదనాత్మక సంకీర్తనలు

సాధారణంగా ఏ కవిగాని తనదయిన ప్రవృత్తిని తన ఇష్టానిష్టాలను తన రచనలలో ప్రత్యక్షపరోక్ష పద్ధతులలో వ్యక్తీకరించడం సహజం. వాగ్గేయకారులు తమదయిన ఇష్టానిష్టాలను చాలావరకు ప్రత్యక్షపద్ధతిలోనే వ్యక్తీకరిస్తుంటారు. వీరి నివేదనలు చాలా వరకు భగవత్సంబంధములు, కొంతవరకు లౌకికజీవనుల నుద్దేశించినవి కొన్ని. భగవంతునికి మొరపెట్టుకొనే నివేదనలు. వీటిని ప్రస్తావించడం ఈ ప్రకరణంలోని ప్రధానాంశం.

### 2.1.2.1. గతజన్మచింతన

భారతీయుల విశ్వాసం ప్రకారం 84లక్షల జీవరాశుల జన్మల అనంతరం మానవజన్మ. అందుచేత శ్రీపాదరాయలు గతజన్మలలో తాను ఎన్ని పాపాలు చేశానో? అని వ్యథచెందుతూ ఒక కీర్తనలో తన అభిప్రాయాలను సువ్యక్తం చేశారు.

**'అన్నంతకాలదల్లి నిన్న నా నరియదె భవగళల్లి బందెనో**
**అన్నంతకాలదల్లి నిన్నవనెనిసదె మూరుఖ నాదనో**
**అన్నంతకాలదల్లి నిన్న చరణరతి యిల్లదె నొందెనో''**

'ఎన్నో జన్మలు. ఎన్నో రకాలయిన దేహధారణలు. ఆ యా జన్మలలో ఆలాగే వివిధ రూపధారణలో నీ గురించిన ధ్యాస ఏమాత్రమూ లేక



గడిపేశాను. నిన్ను ఏ క్షణమూ తలచని పాపిని. మూర్ఖుణ్ణి. నీ చరణస్మరణ, పాదసేవ, సదా ధ్యానాదులు లేక వెతల పాలయ్యాను' అని ఆర్తితో చింతించారు శ్రీపాదరాయలు.

సహజంగా ఉత్తములకు ఆత్మశోధన ఉంటుంది. దానితో 'నిర్వేదం' కూడా సహజమే. ఆ నిర్వేదాన్ని శ్రీపాదరాయలు

**'యాకె పుట్టిసిదె నీ సాకలారదె జగ**
**దేక కారణపురుషనె కృష్ణ'** అనే కీర్తనలో చెప్పుకొన్నారు.

జగదేక 'కారణపురుషా! కృష్ణ! నన్ను కాపాడలేని వాడవు. కాపాడడానికి ఇష్టపడని వాడవు. ఎందుకు నన్ను పుట్టించావని ఆవేదన.

### 2.1.2.2. ఆత్మనింద

ఉత్తములు తమ్ము తాము నిందించుకొంటారు. అధములు ఇతరులను నిందిస్తారు. అంచేత శ్రీపాదరాయలు తమ్ము తాము నిందించుకొంటూ –

**'నానే సజ్జన నాదదె ఇంథ**
**హీన విషయగళిగెరుగువె నేనయ్యా'** అన్నారు.

'నేను సజ్జనుడనయితే హీనకార్యాలు చేస్తానా? సదాచారపరుల్ని నిందిస్తానా? గురువుల్ని, పెద్దల్ని, సజ్జనుల్ని లెక్కచేయకుండా ఉంటానా? హరిని మరచి పరదైవాలను తలుస్తానా? ఇతరుల వస్తువులకోసం ఆశపడతానా? మనసును పురుషోత్తముని పట్ల నిలుపకుండా ఉంటానా? ఉత్తములతో తాత్త్వికవిచారం చేయకుండా నాట్యమాడేవారితో సహవాసం చేస్తానా? హేయమని తెలిసినా నా శరీరపోషణ రక్షణలపట్ల జాగరూకత వహిస్తానా? రంగవిఠలుని మరచిపోతానా?' అని ఆత్మనింద.

**2.1.2.3.** సంప్రార్థన

భక్తుడు ఒక దశలో దైన్యంలోపడి దారీ తెన్ను తెలియక **'పాలొళగద్దు నీరొళ గద్దు'**(పాలలో ముంచు నీటిలో ముంచు) అని శరణాగతిలో పడతాడు. ఆ దశలో రకరకాల సంప్రార్థనలుంటాయి.

**'ఉత్తమర సంగ యెనగిత్తు'** (ఉత్తముల స్నేహం నాకు ప్రసాదించు), **'ఇదనాదర కొడదిద్దరె నిన్న పదకమలవ నంబి భజసువదెంతో'** (ఇదయినా ఇవ్వకపోతే నీ పదకమలాలను నమ్మి భజించడమెందుకో),

**'నా నినగేను బేడువు దిల్ల – ఎన్న**
**హృదయకమలదొళు నెలెసిరు హరియె'**

'నేనేమీ నిన్ను కోరను. నా హృదయకమలంలో సదా నిలు' ఇదే నా ప్రార్థన. నా శిరస్సు నీ పాదాలచెంత వాలనీ! కళ్ళు నిన్ను తదేకంగా చూడనీ! నాలుక నీ గీతాలు పాడనీ! మనసు నిన్ను సదా ధ్యానించనీ! నాసిక నీ నిర్మాల్యాన్ని మూర్కొననీ! నా చేతులు నీ ముందు జోడించి ప్రార్థించనీ. నా కళ్ళు తీర్థయాత్రల దర్శనార్థమై వెళ్ళనీ. నాకు నీ భక్తజనుల సహవాసమబ్బనీ. సన్యాసి అయిన నా చిత్తవృత్తి యోగాభ్యాసంలో నిరతం నిలువనీ. విఠల! నీ దయ సర్వకాల సర్వావస్థ లలోనూ నాపై ఉండనీ'.

**2.1.2.4.** ఆర్తి ప్రకటన

శ్రీపాదరాయల ఆర్తి ప్రకటనలో చాలవరకు 'నిన్నే నమ్మాను' నీవే కాపాడాలి. నీవే కరుణించాలి నిన్ను అనడం సహజం. నిన్ను నమ్మి సేవించడమెప్పుడో అనడం రెండవదశ.

**పాలొళగళద్దు నీరొళగద్దు హరి**
**నా నిన్న <u>నంబిదనో</u>**



**హరే వేంకటశైలవల్లభ**
**<u>పొరెయ బేకు</u> ఎన్న**

**సరసిజనాభనె సెరగొప్ప బేడువె**
**దురితగళెల్ల తరిదు వరవిత్తు <u>కరుణిసో</u>**

**దయమాడి సలహయ్యా భయనివారణనె**
**హయవదన నిన్నచరణ <u>నంబిదనో</u> జీయా**

**ఇదనాదర కొడదిద్దరె నిన్న**
**పదకమలవ నంబి భజసువదెంతో**

చివరకు నిర్వేదంతో 'నీవెలా ఉంచితే ఆలాగే ఉంటాను' అంటూ **'ఇట్హాంగె ఇరువెనో హరియ ఎన్న దొరెయే'** అన్నారు శ్రీపాదరాయలు.

వీటితోబాటే శ్రీపాదరాయలు సామాన్యజనుల ఆర్తిని తమ ఆర్తిగా భావించి పరస్తుతివైముఖ్యం, పరసేవా దౌర్భాగ్యాదులను ప్రస్తావించారు. చివరకు సామాన్య వ్యక్తిలా ప్రాణత్యాగానికి సిద్ధపడినట్లు తన కృతనిశ్చయాన్ని ప్రకటించారు.

**'ఉరి యొళిగె బిద్దు శరీరవను కళెయలో**
**పరువతవనేర్యురుళిలో కృష్ణ**
**గరళమడువనె ధుముకి ఉరగఫణ తుళియలో**
**ఎరడొందు శూలక్హాయలో కృష్ణ.**

మంటలోపడి శరీరాన్ని త్యజించనా? ఎత్తయిన పర్వతంనుండి దొరలనా? విషం నిండిన మడుగులోపడి పాముపడగలపై నాట్యమాడనా? నా దేహాన్ని శూలాలకు అర్పించనా కృష్ణా!

చివరగా శ్రీపాదరాయల నివేదనకు మరొక 'సుళాది' రచన సాక్షి.

**'నిన్నాధీన శరీర కరణ చేష్టగళెల్ల**
**నిన్నాధీన బంధ మోక్షనిరయగళు'**

దేవా! శారీరకమయిన చలనాలు, లోకంలో బంధనాలు, మోక్షం, సాధ్యా సాధ్యాలు, సుకృతదుష్కృతఫలాలు అన్నీ నీ ఆధీనాలు.

**2.1.3. ఇతరములు**

ఈ వర్గంలో చేరదగ్గవి శ్రీపాదరాయల శ్రీలక్ష్మీనృసింహ ప్రాదుర్భావ దండకం, మధ్వనామ, రఘునాథతీర్థపాదుల ప్రస్తుతులు.

**2.1.3.1. లక్ష్మీనృసింహ ప్రాదుర్భావ దండకం**

శ్రీపాదరాయలు రంగవిఠ భక్తులయినా నారసింహభక్తులు. వారి విశిష్టకృతి శ్రీ లక్ష్మీనృసింహ ప్రాదుర్భావదండకం. ఇది భాగవతానుసారంగా రచితం. పేరుకు దండకమయినా కన్నడ ఛందస్సంబంధి లక్షణాలతో సాగిన సుదీర్ఘ రచన. ఈ రచనకు భాగవతం సప్తమస్కంధంలోని ఎనిమిదవ అధ్యాయం మూల మనవచ్చు.

హిరణ్యకశిపుని సంహరించిన స్వామి ఉగ్రరూపుడయ్యాడు. ఆ స్వామి కోపం చల్లారలేదు. దేవతలందరు ప్రార్థించినా స్వామి శాంతించలేదు. చివరకు బ్రహ్మ లక్ష్మీదేవిని ఆశ్రయించి స్వామి కోపోపశమనం చేయవలసిందిగా ప్రార్థించాడు. ఈ సన్నివేశాన్ని మూలంలో కంటే శ్రీపాదరాయలు విస్తృతంగా పెంచారు. లక్ష్మీదేవి ప్రార్థించినా స్వామి ఉగ్రత్వం శాంతించకపోగా చివరకు బ్రహ్మ ప్రహ్లాదుని **'నమ్మప్ప నల్లప్ప తత్కోప సంక్షేపగైసు' – (మా తండ్రి నల్లనయ్య కోపాన్ని శాంతింప చేయమని)** వేడుకొన్నాడట. అపుడు ప్రహ్లాదుడు స్వామి పాదాలకు సాష్టాంగ నమస్కారం



చేయగా స్వామి శాంతించి తన చేతులతో ఎత్తి ఆ ప్రహ్లాదుని లాలించినట్లు శ్రీపాదరాయలు వర్ణించారు. మూలంలో ఈ భాగం సంక్షిప్తంకాగా శ్రీపాదరాయల రచనలో ప్రహ్లాదుని పూజాదులున్నాయి. అవి 'తంత్రసారోక్తంగా' నిర్వహింపబడడం విశేషం.

ఈ దండకం చివర 'న్యాపతీ లక్ష్మీనృసింహ నానింతు కొండాడిదెం' అని చెప్పడంవల్ల శ్రీపాదరాయలు ప్రత్యేక సందర్భంలో న్యాపతిక్షేత్రంలో ఈ దండక రచన సాగించినట్లు తెలుస్తుంది. ఈ దండకం చివర ఫలశ్రుతి చెప్పబడింది. ఎవరయితే ఈ దండకాన్ని భక్తితో ప్రస్తుతిస్తారో, పఠిస్తారో, వింటారో అటువంటి సాధుజనుల పాపాలు పరిహారమవుతాయని భరోసా. చివర –

**'స్వామియే శ్రీరమాకామిమే ప్రేమియే**
**త్వాం నమస్తే నమస్తే నమస్తే నమః'** అని పూర్తవుతుంది.

**2.1.3.2. 'మధ్వనామ'**

శ్రీపాదరాయలు విద్యావినయసంపన్నులు. విశిష్టమఠాధిపతుల దగ్గర వేదాంతం అభ్యసించినవారు. ప్రత్యేకించి ద్వైతసంబంధి శాస్త్రాలను కూలంకషంగా అధ్యయనం చేసినవారు. ఆ కారణంవల్ల ద్వైతమతప్రచారానికి మూలవరులయిన మధ్వాచార్యుల అవతారత్రయాన్ని సుమారు 26 చరణాలుగల **'జయ జయ జగత్రాణ జగదొళగె సూత్రాణ'** అనే కీర్తనలో వర్ణించారు. ఈ కీర్తనలో అనేక పురాణాల ఆధారంగా వాయుదేవుని గొప్పతనం వర్ణితం. ఆపై త్రేతాయుగంలో శ్రీరామపదభక్తి సేవాపరుడయి జీవించిన హనుమంతుని విక్రమవిహారాలను విశదం చేశారు. ద్వాపరయుగంలో భీముడై జన్మించి రాక్షసవిదళనం చేయడాన్ని ప్రస్తావించారు. ఆలాగే కలియుగంలో మధ్వాచార్యులుగా జన్మించి పాషండమతాలను పారద్రోలినారని వర్ణించారు. ఈ రచన పౌరాణిక సన్నివేశ

సుమహారమనడం సమంజసం. మాధ్వులు అనురక్తితో చదువుకొనే 'దేవర నామగళు'లో ఇదొకటి. ఈ మధ్వనామంలో చివరి చరణం –

**'జయ జయతు దుర్వాదిమతతిమిరమార్తాండ**
**జయ జయతు వాదిగజ పంచానన**
**జయ జయతు చార్వాక గర్వపర్వత కులిశ**
**జయజయ జగన్నాథ మధ్వనాథ'**

ఈ మధ్వనామం చివర ఫలశ్రుతి కూడా చెప్పబడింది. సంతానం లేనివారు ఈ మధ్వనామం శ్రద్ధతో చదివితే సంతానవతులవుతారట. సర్వత్ర జయం సంప్రాప్తిస్తుందట. శత్రునిర్మూలనం తథ్యమట. గంగానదీతీరంలో సోమసూర్యాది యాగాలు చేసిన ఫలితం. గోసహస్రం భూసురుల కిచ్చిన పుణ్యం లభిస్తుందట.

### 2.1.3.3. శ్రీరఘునాథతీర్థుల ప్రస్తుతి

విద్యార్థిదశ చిత్రమయింది. ఆ దశలో శ్రద్ధ, స్పర్ధలు సహజం. అంతేకాదు వినయాదులు చదువుకు రెట్టింపు గౌరవాన్ని ప్రసాదిస్తాయి.

విబుధేంద్రతీర్థులవారు శ్రీరఘునాథతీర్థులతో లక్ష్మీనారాయణుల విద్వత్పరీక్ష చేయమన్నారట. ఆ పరీక్షలో లక్ష్మీనారాయణులు నెగ్గారు. అతని వ్యాఖ్యాన సరళికి శ్రీరఘునాథతీర్థులు పరవశించి ప్రశంసలు కురిపించారు. కాని లక్ష్మీ నారాయణులు వినయంతో మీరు **'శ్రీపాదులు'** అని నమస్కరించారట. రఘునాథ తీర్థులు మేము **'శ్రీపాదుల'** మయితే మీరు '**శ్రీపాదరాజరు'** అన్నారట. ఆలాంటి యతివర్యులను శ్రీపాదరాయలు **'వందనె మాడిరై యతికుల చంద్రన పాడిరై' (వందనాలు చేయండి. యతికులానికే చంద్రులయిన రఘునాథుల కీర్తిని పాడండి)** అని



ఐదుచరణాల కీర్తన పాడారు. **'రుద్రవంద్యమూరితి రంగవిఠలన పదపద్మారాధనే ప్రసిద్ధ మునిచంద్రన'** అని వినుతించారు.

## 2.2. శ్రీకృష్ణ సంకీర్తనలు

శ్రీపాదరాయల కీర్తనలలో సంఖ్యాపరంగా రెండవభాగంగా పరిగణించదగ్గవి శ్రీకృష్ణసంకీర్తనలు. వీటిలో నారసింహ, శ్రీరామ, శ్రీకృష్ణావతారాలకు ప్రసిద్ధి. తమిళంలో ఆళ్వారులయితేనేం? కన్నడంలో హరిదాసులయితేనేం? ఈ భావనతోనే పాశురాలు, దేవరనామగళు వ్రాశారు. పైపెచ్చు హరిదాసులకు 'విఠలుడు' ప్రధానమూర్తి. విఠలుడు సాక్షాత్ కృష్ణుడే. అంతేకాదు ఈ రచనలకు మధ్వాచార్యులకూ ఉడిపి క్షేత్రానికున్న ప్రగాఢసంబంధం కూడా ప్రేరకాలు. అంతేగాక భాగవతం దశమస్కంధంలోని శ్రీకృష్ణచరిత హరిదాసులను ఆకర్షించిన ప్రధాన భాగం కావడం.

శ్రీపాదరాయల కృష్ణసంకీర్తనలను ప్రధానంగా వాత్సల్యకీర్తనలు, మధురభావ భరితాలని వింగడించవచ్చు.

### 2.2.1. వాత్సల్య కీర్తనలు

నవవిధభక్తి భేదాలలో వాత్సల్యం ఒకటి. 'వత్స' మంటే దూడ. దూడ నేల బడగానే ఆవు తన నాలుకతో దూడకున్న మురికినంతా నాకి శుభ్రపరుస్తుంది. ఆవుకు దూడపైగల మమకారం అతివేలం. ఆలాగే మానవమాత్రులలో కూడా మాతాసుత వాత్సల్యం సహజం. ఈ వాత్సల్యం మాతృగతం, బాలకృష్ణగతం, గోపికాగతంగా వర్గీకరించవచ్చు.

#### 2.2.1.1. మాతృగతం

'మాత' అంటే తల్లి. కన్నయ్య తల్లి యశోద. ఆ యశోదకు 'నందనందనుని' మీది వాత్సల్యం అపారం. లేకలేక పుట్టినబిడ్డ. అంతేకాదు

భువనమోహనుడు. బాల్యంలోనే రాక్షసులవల్ల పడరాని బాధలు ఎదుర్కొన్నవాడు. అందుచేత తల్లి తన బిడ్డ క్షేమం కోరుకోవడంలో తప్పేమీ లేదు. తన కుమారుడు తన ఎదుటనే తచ్చాడా లని ఆవిడ ఆరాటం. కాని కన్నయ్య ఎక్కడో ఆడి వచ్చాడు. యశోద గుర్తించింది. దండించే రూపంలో, ప్రార్థనారూపంలో కన్నయ్యతో తన ఆరాటాన్ని బహిర్గతం చేసింది.

ఈ నేపథ్యంలో శ్రీపాదరాయలు రెండుకీర్తనలు వ్రాశారు. ఈ రెండు కీర్తనలు **'ఎల్లాడి బంద్యో'** (ఎక్కడ ఆటలాడి వచ్చావు?) అనే పదాలతో మొదలవుతుంది.

రంగయ్యా! ఎక్కడరా ఆటలాడి వచ్చావ్? నా కళ్ళుగప్పి ఎక్కడో ఆడపోయి నట్లున్నావ్. నా కళ్ళెదుట లేవుగా!

గుడి పరిసరాల్లో ఆడడానికి వెళ్ళావా? నీ కెంతో ఇష్టమని పాలు, చక్కెర తీసి పెట్టా. ఆటలకు మరిగి సాటివారితో వెళ్ళిపోయావేమో కృష్ణా? ఇంక ఎక్కడికీ వెళ్ళకు. ఇంటి వాకిట్లోనే ఆడుకో. నీకోసం ఎనిమిది దిక్కులూ వెదికినా! నీవు కనబడకపోతే జడుసుకొన్నా. నా కళ్ళముందు ఆడుకోరా! నన్ను అర్థం చేసుకోరా! మరో కీర్తనలో తల్లి కొడుకును ధట్టించి అడిగినట్లు వర్ణన –

నిన్నే! ఆగు ఆగు. ఎక్కడో ఆడి ఆడి నింపాదిగా ఈ వేళకు వచ్చావు. నేనెంత బెంగపెట్టుకున్నానో. నీ నొసట చిరుచెమటలు పట్టింది. ఇప్పటికే నీమీద కొత్తకథ అల్లారు. ఏదీ! నా దగ్గరికిరా. ఉంగరాలెక్కడ? మెడలోని పతకం జారిందా. ఎక్కడో సరసాలాడి వచ్చావేమో? నీ చేతల కారణంగా నీవే నవ్వుల పాలవుతున్నావు.

యశోదను గోపికలు చుట్టుముట్టారు. కన్నయచేష్టల్ని గోరంతలు కొండంతలుగా చెప్పారు. యశోద జడిసింది. అయినా వారికి దీటుగా



సమాధానం చెప్పింది. ఆ భావాలుగల కీర్తన **'ఏకె దూరువరె రంగయ్యన' (ఎందుకర్రా నా రంగని నిందిస్తున్నారు)**

చాల్లే! పనిపాట లేక నా కొడుకును ఎందుకు ఆడిపోసుకొంటున్నారు? వీడు పసిబిడ్డ. ససేమిరా నమ్మను. మీరు చెప్పేవన్నీ అబద్ధాలు. వీడికవన్నీ చేతకాదు. గుంజకు బాగాకట్టిన దూడను వదలించగలడా? ఎంత కసే మీకు మా వానిపై. మీగడ, పాలు, వెన్న పెడితే వాటికేసి చూడనైనా చూడడు మావాడు. పాలు, పెరుగు మా ఇంట లేవా? మమ్మల్ని ఆట పట్టించాడని చెప్పుకోవడానికి మీకు సిగ్గులేదా? ఒకసారి అమాయకుడయిన బాలుణ్ణి చూడరే!

### 2.2.1.2. గోపికాగతం

ఆప్యాయంతో, వాత్సల్యంతో, గౌరవంతో ఇతరులను ఆహ్వానించడం స్వాగతం. అందగాడు, ముద్దొచ్చేవాడు అయిన కన్నయ్యను గోపికలు తమ ఇంటికి రమ్మని పిలవడం, గారాబం చేయడం, బతిమాలడం లాంటివి గల కీర్తనలు శ్రీపాదరాయల సంకీర్తనలరాశిలో మూడు కనిపిస్తాయి.

మొదటిది – **'బారో నమ్మమనిగె'** (రారా! మా ఇంటికి) రెండవది – **'రంగ మనిగె బారో కృపాంగ శ్రీరంగ'** (రంగ! ఇంటికిరా! కృపాంగ! రంగ!)

మొదటిది సామాన్యకీర్తన. రెండవది గోపిక తన ఇంటికి కన్నయ్య వస్తే ఏలా ముద్దెట్టుకొంటానో! "రా! వాలిని సంహరించినవాడవు. సప్తతాళవృక్షాలను భేదించినవాడవు. సముద్రుణ్ణి జడుసుకొనేలా చేసినవాడివి. లంకావాసులకు దిగులు పుట్టించి లంకాదహనం చేసిన హనుమను మెచ్చుకొన్న అచ్యుతుడా! రా! హారాలు నీ మెడవేసి నిన్ను ముద్దాడుతాను. కౌరవపాండవుల మధ్య కలహం పుట్టించి రథం నడిపిన వాడవు. నీ వేళ్ళకు ఉంగరాలు తొడిగి ముద్దెట్టుకొంటాను. నీ మనోహరాకారాన్ని తనివితీరా చూస్తాను".

మూడవకీర్తన ఇంటికి రమ్మని గాక ఆలా వాహ్యాళి వెళదామని రంగని ఆహ్వానించే స్వాగతకీర్తన.

**పోపు హోగోణ బారో రంగ**
**పోపు హోగోణ బారో ॥పల్లవి॥**

**జాహ్నవియ తీరవంతె**
**జనకరాయన కువరియంతె**

**జానకియ వివాహవంతె**
**జాణ! నీ బరబేకంతె ॥పోపు॥**

**కుండినీయ నగరవంతె**
**భీష్మకన కువరియంతె**

**శిశుపాలన ఒల్లళంతె**
**నినగె వాలె బరెదళంతె ॥పోపు॥**

**పాండవరు కౌరవరిగె**
**లెత్తవాడి సోతరంతె**
**రాజ్యవన్ను బిడబేకంతె**
**రంగవిఠల బరబేకంతె ॥పోపు॥**

సాధారణంగా పెద్దలు పిల్లల్ని తమతో రమ్మనిగాని, లేదా అలా తామే వాహ్యాళిగా తిప్పుదామని పిలవడం సహజం. ఆ రీతిలో స్వామిని పిలుస్తున్నాడు భక్తుడు. ఎక్కడికని చెబితేగానీ పిల్లవాళ్ళు కదలరు కనుక భక్తుడు స్థలనిర్దేశం చేస్తున్నాడు. రంగని శిశువుగా భావిస్తూ రమ్యంగా చిత్రీకరించిన కీర్తన ఇది.



గంగాతీరమంటా! జనకరాజు పుత్రిక యంట. జానకి వివాహమంట. ఒరేయ్ జాణ! నీవు రావాలంటా! పెళ్ళిసంబరం కదా! కోలాహలంగా ఉంటుంది. వస్తావు కదూ!

కుండినీ నగరమంటా! భీష్మకరాజేంద్రుని బిడ్డంట. శిశుపాలుని పెళ్ళాడ డానికి ససేమిరా వీల్లేదన్నదట. నీకు ఉత్తరం కూడా వ్రాసిందట గదా! ఇంకా ఎందుకు ఆలస్యం? పోదాం పద!

పాండవులు కౌరవుల చేతిలో జూదంలో ఓడిపోయారంట. సర్వం త్యజించి, తాము రాజ్యం వదలి అరణ్యాలకు వెళ్ళాలంట. రంగవిఠలా! ఇంకా నీవే దిక్కని నీకోసం ఎదురు చూస్తున్నారంట. వెళదామా అక్కడికి!

హరిదాసులు పెళ్ళిసంబరాల దర్శనానికే పిలవడం లేదు. కష్టాలలో మునిగి దిక్కుతోచని వారిని కటాక్షించడాని కోసమయినా రావయ్యా! అని పిలుపు.

పాండవులు కృష్ణుని సదా స్మరించేవారే. కాని ద్యూత సమయంలో కృష్ణుని తలచుకోలేదు. ఒకవేళ ధర్మరాజు కృష్ణుని తలచుకొని ఉంటే అతడే గెలిచేవాడేమో! అపుడు ధర్మరాజు తనమీద, తన అక్షవిద్యమీదనే నమ్మకం పెట్టుకొని ఆడాడు. అందుచేత ఓడిపోయాడు. ఓడిపోయాక కృష్ణుడు గుర్తుకు వచ్చాడు. ఆపదలోని బంధువులను ఆదుకోవడం ధర్మంకదా! అంచేత దాసులవారు 'రంగని' 'పరమాత్ముని' రమ్మని ఆహ్వానిస్తున్నారు. మొదటనే పాండవుల దగ్గరికి రమ్మంటే భీష్మించుకొంటా డేమోనని సీతాస్వయంవరం, రుక్మిణీస్వయంవరం సన్నివేశాలను కూడా వర్ణించారు.

### 2.2.1.3. బాలకృష్ణాత్మక కీర్తనలు

మహావిష్ణువు అవతారాలలో శ్రీకృష్ణావతారానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఆ స్వామి శైశవ, కౌమారదశలోనే అనేక రాక్షసులను సంహరించాడు.

కనుకనే కవులు శ్రీకృష్ణుని బాల్యదశను అనురక్తితో వర్ణించారు. ఆ బాల్యలీలలకు తన్మయులై పెరియాళ్వార్, బిల్వమంగళుడు, సూరదాస్ లాంటివారు అనేక పదాలు వ్రాశారు. అలాగే శ్రీపాదరాయలు కృష్ణుని అమాయకత్వాన్ని చాటే పదాలెన్నో వ్రాశారు. మచ్చుకు –

**గొల్లతియరెల్ల కూడి ఎన్నమేలె ఇల్లద సుద్ది పుట్టిసి**
**కళ్ళనెందు దూరుతారె గోపి ఎన్న కొల్లబేకెంబు ఒగెయె**

**హరవియ హాలు కుడియలు ఎన్న హొట్టె**
**కెర యేనె హేళమ్మయ్య**
**కరెదు అణ్ణన కేళమ్మ ఉంటాదరె**
**ఒరళిగె కట్టెమ్మయ్య**

**మీసలు బెణ్ణెయను మెలువుదదు ఎనగె**
**దోషవల్ల వేనమ్మయ్య**
**ఆసె మాడిదరె దేవరు కణ్ణ**
**మోసది కుక్కోనమ్మయ్య**

**అట్టవనేరి హిడివుదు అదు ఎనగె**
**కష్టవల్లవె హేళమ్మయ్య నీ**
**కొట్టహాలు కుడియలారదె నాను**
**బట్టలొళగిట్టు పోదెనె**

బాలకృష్ణుని లీలలు భక్తకోటికి ఆనందం. పరమానందం. ఆ లీలాపరంపరలో ఈ కీర్తన ఒకటి.

కన్నయ్య అల్లరివాడు. అతని అల్లరి అనేకరకాలు. మట్టికుండలోని పాలు తాగడం. దేవతారాధన కోసం దాచిన మంచి వెన్న మెసవడం. ఎత్తయిన చోట ఎక్కి అక్కడి వస్తువులకై అర్రులు చాచడం. ఇవన్నీ గోపికల



ఫిర్యాదులు. తల్లి యశోద నింపాదిగా విన్నది. తనవాని సంగతి తనకు తెలుసు. అయినా అందరి ముందు జాడించేలా వాకాబు చేసింది. చివరకు అతడిచ్చిన సమాధానానికి నివ్వెరపోయినవారు యశోదమాత్రం కాదు గోపికలు. ఇంకా చెప్పదలచుకొంటే కృష్ణునితోడి తుంటరులు. అసలు కృష్ణుని సమాధానం –

అమ్మా! గోపికలందరు నామీద కక్ష గట్టారమ్మా! చూడు. కలిసికట్టుగా వచ్చి నాపై లేనిపోని కొండేలు మోపి 'దొంగగా' నిలబెడుతున్నారమ్మా! అంతేకాదు నీ చేత చావగొట్టించాలని వారి అక్కసు.

అమ్మా! విను! నా కడుపెంత? జేనెడు. మరి కడవేమో పెద్దది. పెద్ద కడవ లోని పాలంతా తాగడానికి నా పొట్ట చెరువా? చెప్పమ్మా! నా మాట నమ్మకపోతే అన్నయ్యను పిలిచి అడగవమ్మా! అదే సత్యమయితే అదిగో! ఆ రోటికి కట్టేయు మమ్మా!

దేవతార్చనకోసం దాచిపెట్టిన వెన్న నేను తింటానమ్మా! అసలు ఆవైపు నేను కన్నెత్తయినా చూడలేదే. ఒకవేళ ఆ వెన్నకే నేను ఆశపడితే దేవుడు నా కళ్ళు పొడిచేయడూ!

అటకలకెక్కడం, ఉట్లు అందుకోవడం నాకు సాధ్యమా? అదెంత కష్టమో నీవే చెప్పమ్మా! నీవు తాగమని నా కిచ్చిన పాలే తాగలేక తాగలేక బట్టలో దాచి వెళ్ళిపోయాను కదమ్మా!

### 2.3. శృంగార సంకీర్తనలు

**"శృంగా ఏవ మధురః పరప్రహ్లాదనో రసః"** అని ఆలంకారికోక్తి. ఈ శృంగారం సంయోగం, వియోగమని రెండు రకాలు. వాగ్గేయకారులు సంయోగ వియోగ కీర్తనల్ని తమ పదాలలో వర్ణిస్తుంటారు. అన్నమయ్యాదులు ఆళ్వారుల మార్గంలో 'మధురభక్తి'కి ప్రాధాన్యమిచ్చి ఈ శృంగారాన్ని

పలుపోకల వర్ణించినారు. భగవంతుడొకడే పురుషుడు '**స్త్రీప్రాయ మితరం జగత్**' అనే ధోరణిలో ఆకారం పురుషాకారమయినా స్త్రీత్వమారోపించుకొని భగవంతుని చేరికకు జీవుడు తపించడం శ్రీవైష్ణవంలో కనిపిస్తుంది. కాని కన్నడవాగ్గేయకారులు ఈ మధురభక్తిని గోపికల వరకే పరిమితం చేసి శుచిత్వాన్ని, పవిత్రతను చేకూర్చేలా రచనలు చేశారు.

శ్రీపాదరాయల కీర్తనలలో శృంగారసంబంధి కీర్తనలను వేణుగీతాలు, విరహ గీతాలు, భ్రమరగీతాలని వర్గీకరించవచ్చు.

### 2.3.1. వేణుగీతాలు

స్వామి పిల్లనగ్రోవి నాదం సమస్తప్రపంచాన్ని తన్మయత్వంలో ముంచేది. ఆ తన్మయత్వం గోపికలలో హెచ్చు. ఈ నేపథ్యంలో శ్రీపాదరాయలు '**తురుకాయ బంద గోపియకంద**' (గోపమ్మ కుమారుడు ఆవుల్ని మేపడానికి వచ్చాడు) అనే కీర్తనలో వేణునాద వినోదాన్ని రమ్యంగా వర్ణించారు. ఆ నాదం సుర, నర, తరు, మృగ, జలచర మోహకమట. ఆ నాదం వినాలని ఆ బాలకిశోరుని చూడాలనే తపనతో గోపికలు అలంకరణలో ఆభరణాలను తారుమారుగా అలంకరించుకొని విభ్రమంతో విచ్చేశారట. అపుడు గోపికలను లాలించిన కృష్ణుని చూచి రంభ, ఊర్వశి, మేనకలు నాట్యమాడినారట. ఈ లీలావిలాసమంతా భక్తులను కాపాడ డానికే అని శ్రీపాదరాయలు కీర్తనాంతంలో –

**"మధుసూదన భక్తర కాయ్యువదకె**
**విధదొళగాడిద రంగవితల"** అని వర్ణించారు.

ఆలాగే రెండవ కీర్తనలో కన్నయ్య వేణునాదతరంగాలకు హంగ, విహంగ, భుజంగ, సారంగ, మాతంగ, కురంగాదులు పరమాత్ముని పాదాల వాలాయట. గోపికలు బంగారుగిన్నెలో పాలను నింపి సంతోషంతో



'మంగళాత్మకునికి' అర్పించా రట. స్వామి వారిని లాలించాడు. ఈ దృశ్యాన్ని చూచిన దేవతలు పూలవృష్టి కురిపించారట. గోపికలు తాము తెచ్చిన గంధం కస్తూరి మొదలయిన సుగంధ ద్రవ్యాలను బాలకృష్ణునికి సమర్పించి సంతోషించారట.

ఈ రెండు పదాలలోని వర్ణనలకు సంస్కృత భాగవతం దశమస్కంధం ఆధారమని స్పష్టమవుతుంది. '**వ్యోమయానవనితాః సహసిద్ధైః విస్మితాః**' వాక్యాలు, **సురేశాః శక్రశర్వ పరమేష్టి పురోగః – వృందకోవ్రజవృషా మృగగావో వేణు వాద్యహృత చేతసాః**' వాక్యాలు పరిశీలించదగ్గవి. తాను చెప్పే అంశం ప్రామాణిక మనడానికే ఈ వాక్యాలు.

### 2.3.2. విరహగీతాలు

శ్రీపాదరాయల గోపికావిరహగీతాలు చాలవరకు ఆలంకారికాలు. అంతేకాదు 'మనోధర్మ' ఆశ్రితాలు. వీటిలో మన్మథావస్థలన్నీ కనిపిస్తాయి. గోపిక లందరు త్రేతాయుగంలో శ్రీరామచంద్రుని మోహనరూపానికి పరవశించిన మునీశ్వరులు. జీవాత్మస్వరూపులు.

మధురకు వెళ్ళిపోతున్న శ్రీకృష్ణపరమాత్మ విరహం భరించలేక తమ యాతనల్ని, మానసికములైన ఆవేదనల్ని బహిర్గతం చేసుకొంటారు. వారికి శరీరం మీద, జీవితం మీద విరక్తి పుట్టింది. వారికి మెడలోని హారాలు బరువయ్యాయి. వారు మదనబాణాలకు సొక్కి వేదనతో కొట్టుమిట్టాడుతున్నారు. '**పరమాత్ముని నమ్మిన వారికి ఇదేనా గతి**' అని వాపోయారు. పిల్లతెమ్మెరలు, చల్లనిగాలులు మంటలు రేపుతున్నాయి. చిలుకపలుకులు కర్ణకఠోరాలుగా వినిపిస్తున్నాయి. చంద్రకిరణాలు దేహాన్ని తపింపజేస్తున్నాయి. కృష్ణుడు లేని బృందావనం 'ఉస్సురు మంటుంది' అని వాపోయారు. ఈ భావంగల కీర్తన –

**'మందానిలన సహిస లాగదు**
**నొందె శుకపిక రవగళింద**
**చంద్రకిరణది బెందె ఇన్నీ**
**వృందావనవేకె వనవనగల'**

వలచిన వ్యక్తి దూరమయినవేళ అతని అందచందాల్ని ఆలాగే అతని శౌర్యాదుల్ని, తమకు అతనితోగల సాహచర్యాన్ని మననం చేసుకోవడం మనోధర్మం. అంచేత గోపికలు శ్రీకృష్ణలీలల్ని – పూతనాసంహారం, తృణాసుర, శకటాసుర సంహారాదులను పదేపదే చెప్పుకొంటారు. గోపాల! నీవు మథురకు వెళిపోతే గోకులంలో ససేమిరా ఉండలేమంటారు –

**'తెరళె నీ మథురగె గోకులదల్లి నావు**
**ఇరలారె ఇరలారెవో గోపాల'**

### 2.3.3. జానపదీయాలు

శ్రీపాదరాయలు గోపికావిరహగీతికలలో జానపదధర్మాలను చాల చక్కగా జోడించారు. పల్లెటూళ్లలో అపరిచితుడయిన వ్యక్తి రావడం సంచలనాన్ని రేపుతుంది. అంతేకాదు గ్రామంలోని పెద్దలతో మంతనాలాడడం వారి కుతూహలాన్ని రెట్టింపు చేస్తుంది. కర్ణాకర్ణిగవిన్న అంశాలు వారిని కలచి వేస్తాయి. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణుడు మథురకు వెళుతున్నాడని స్పష్టం అయ్యాక గోపికల మనోభావాలను శ్రీపాదరాయలు జానపదధర్మాలతో రమ్యంగా వర్ణించారు.

రేపల్లెలో చెలికత్తెలు ఒకచోట కలుసుకొని ఇలా సంభాషణ కొనసాగిస్తారు.

'విన్నావటే ఈ సుద్ది విన్నావా? అంటుంది ఒక చెలి 'నీ కంటే నేనే ముందు విన్నా' అంటుంది మరో చెలి. మోసగాడు కృష్ణుడు రేపే



కోడికూయకముందు మథురకు వెళతాడట. కృష్ణుని తన వెంటబెట్టుకొని వెళ్ళడానికి అక్రూరుడు వచ్చాడట. పెద్దవాడు కదా! అని రామకృష్ణులు అక్రూరునికి నమస్కరిస్తే చనవుతో వారిని తమ వెంట రమ్మన్నాడట. మథురలో ధనుర్విద్యావిలాసమట. ఆ విద్యలో రామకృష్ణులు గెలిచి తిరిగివస్తారట. అంతేకాదమ్మా. విన్నావా! మరో సంగతి. కృష్ణుని జన్మస్థలం మథురాపురమట. కంసుడు దేవకిదేవి బిడ్డల్ని చంపుతుంటే వసుదేవుడు రేపల్లెకు చేర్చినాడట. మామ కంసుడు పిలిచాడని రామకృష్ణులు మథురకు వెళతారంట. ఈ భావంగల కీర్తన ఎత్తుగడ **"కేళిద్యా కౌతుకవన్ను కేళిద్యా"**

మరోచోట గోపికలు ఇలా వాపోతారు.

'మనసుకు నచ్చని ఒక వార్త వినబడడంతో శరీరం పట్టు తప్పిపోతూ ఉంది. కృష్ణుడు మథురకు రేపే వెళుతున్నాడు. కాళ్ళూ చేతులాడడం లేదు. నడక ముందుకు పడడంలేదు. మాటాడడానికి నోరు పెగలడం లేదు. మనసు ఏవేవో ఊహించు కొంటుంది. గుండె కుదుటపడడం లేదు. అన్నపానాదులపై ఆశ సన్నగిల్లింది' అంటుంది ఒక గోపిక. మరొక కీర్తన భావం –

శ్రీకృష్ణుడు మథురకు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. గోపికలకు ఈ వార్త అందింది. కన్నయ్యను వెళ్ళనీయకుండా చేయాలని వారి కోరిక. అంచేత ఒక చెలి మరో చెలితో 'మాననిధి అయిన శ్రీకృష్ణుడు మథురకు వెళుతున్నాడట. ఇంకా మనకేం దారి?' అని ప్రశ్నించింది. అలాగయితే మనం అడ్డంగా నిలబడి వెళ్ళకుండా చేద్దామని చెలికత్తెలందరు ఏకముఖంగా అన్నారు. అంతేకాదు కలిసి కట్టుగావచ్చి కృష్ణుని చుట్టూ నిలబడ్డారు. అంతేకాదు 'కృష్ణా! వెళ్ళొద్దు. మథురకు వెళ్ళొద్దు' అంటూ దైన్యంగా వేడుకొన్నారు. అపుడు కృష్ణుడు 'చిననాటి నుండి పరిచితులయిన మిమ్మల్ని

మరిచిపోతానా? నేను వెళ్ళి మరల కొన్నిరోజులలో వస్తానని నమ్మబలికాడు. మథురాపురంలోని మానినీమణులు శ్రీకృష్ణుని మీది మరులుతో వదలిపెట్టరేమో అని వారికి దడ. అంచేత వారు కన్నయ్యతో 'నీ విరహాన్ని తట్టుకోలే' మన్నారు. శ్రీకృష్ణుడు నచ్చచెప్పాడు. అయినా వారు ఒప్పుకోలేదు. చివరకు కృష్ణుడు 'బ్రహ్మ ఆన – మన్మథుడు ఆన' అని ప్రతిన చేశాడు. గోపికలు నవ్వారు.

'మన్మథుడు ఏనాడో శివుని మూడవకంటి చిచ్చు కారణంగా కాలిపోయాడు గదా! మరి బ్రహ్మ నాభీకమలంలో పుట్టినవాడు. వారిపై ఆన వ్యర్థమే! చివరకు నీ పాదపద్మాలను నమ్ముకొన్న మమ్మల్ని ఏం చేయాలనుకొన్నావో ఆలాగే చేయ్' అన్నారు.

శ్రీకృష్ణుడు మథురకు వెళ్ళిపోయాక గోపికల చిత్తవృత్తులను శ్రీపాదరాయలు కరుణరసాత్మంగా వర్ణించాడు.

ఈ వనాలు ఈ లతానికుంజాలు, ఈ నదీసైకతాలు ఈ కల్పవృక్షాలు, ఈ చంద్రకాంతశిలలు ఈ శుకపికాదులు ఎందుకు? మాధవుని మరి మరీ గుర్తుకు తెస్తున్నాయి. మథురకు వెళ్ళిన కృష్ణుడు మరల వ్రేపల్లెకు రానేరాడు. ఒకవేళ రావాలనుకొన్నా మథురలోని చపలాక్షులు వదలిపెడతారా? వారు రతివిదగ్ధలు. మరి కృష్ణుడేమో రసికచక్రవర్తి కదా! అని వాపోయారు. ఈ భావంగల కీర్తన –

**'రంగను మథురెయ అరస నాదమేలె**
**గోకులద గొల్లతియరన్ను నెనెయువుదుంటె'**

గోపికలు ఒకచోట తచ్చాడుతుంటే ఒక తుమ్మెద ఝుమ్మంటూ వారి ముందు తిరుగుతుంది. అపుడు గోపికలు తమ విరహాన్ని తుమ్మెదతో



ప్రకటించుకొంటారు. అయినా చివరకు లక్ష్మీదేవి అంతటి దేవేరి స్వామిని అర్థం చేసుకోలేనప్పుడు మేమెంత అని చివరకు తమ్ము తాము ఆశ్వాసించుకొంటారు. ఈ భావనగల కీర్తన –

**'వనజనయనన మనవ మధుపంబువరె**
**మనదిగెద మదనపిత విఠలరాయా!'**

మరో కీర్తన –

దైవానికి మా మీద దయలేకపోయింది. కృష్ణుడు మా కళ్ళుగప్పి వెళ్ళిపోయాడు. ముంగురులవాడు, నగుమొగమువాడు అయిన కన్నయ్యను ఇంక చూడలేని నిర్భాగ్యులం. పక్షులకులాగా మనకూ రెక్కలుంటే కన్నయ్యపాదాల దగ్గర వాలే వాళ్ళం కదా! కన్నయ్య మమ్మల్ని కాసంత కనికరం కూడా లేకుండా వదలి వెళ్ళిపోయినా ఇంకా మనం జీవించి ఉన్నామంటే మనవి శిలాసదృశ హృదయాలు. ఈ భావాలుగల అక్కాచెల్లెళ్ళ సంవాదకీర్తన ఎత్తుగడ – **"విధిగె దయవిల్లక్క ఎన్న మేలె"**

గోపికాగతమయిన విరహభావనలను శ్రీపాదరాయల తరువాతి వాగ్గేయకారులు అనేకరీతుల పెంచి రసరమ్యం చేశారు.

### 3. శ్రీపాదరాయల కృతులలో కవితాంశాలు

కర్ణాటకసాహిత్యంలోని హరిదాసులు చాలామంది గృహస్థులు. ఒకరిద్దరు బాల్యంలోనే సన్యాసం స్వీకరించి మఠాధిపతులై మతప్రచారం చేసినవారు. సన్యాస స్వీకారంతో, మఠాధిపత్యంతో వారికి సామాన్యజనులతో కలసిమెలసి తిరగడం చాలవరకు తగ్గిపోవడం సహజం. వారు చూచిన లౌక్యులజీవితం ఒక పార్శ్వం మాత్రమే. అయినా తాము విన్నదాన్ని, కన్నదాన్ని, ఆలాగే ప్రసిద్ధ గ్రంథాలసారాన్ని గ్రహించిన వారు తమపదాలలో

లౌక్యుల జీవితాల్ని వర్ణించారు. ఆ వర్ణనలంతా ఆధ్యాత్మికత వైపే మొగ్గుతాయి. అలాంటి వర్ణనలలో స్వభావోక్తి, ఉపమ, రూపకాలే కాక మనస్తత్వ సంబంధి అంశాలు కూడా సమ్మిశ్రితమవుతాయి. ఆ కారణాన వక్తల అభిప్రాయం శ్రోతలకు తేలికగా అర్థం కావడానికి వీలవుతుంది. అలాంటివాటిలో కొన్నిటిని విశదీకరించడం ఈ ప్రకరణోద్దేశ్యం.

శ్రీపాదరాయలది మొదటినుండి ఆధ్యాత్మికదృష్టి. ఈ దృష్టి కలవారికి భగవంతుడే సర్వస్వం. ఆతడే సర్వరక్షకుడు. తనకు బాధ్యత లేదని దేవుడు తప్పించు కోకూడదని వారి భావన. ఈ భావనతో శ్రీపాదరాయలు వ్రాసిన కీర్తన ఎత్తుగడ –

**"దురితగజపంచానన నర**
**హరియె దేవర దేవ కాయో గోవింద"**

ఈ కీర్తనలోని ఉపమానాలు జగత్ప్రసిద్ధాలు. సామాన్యుల అనుభవంలోనివే. పరమాత్ముని హృదయం సముద్రమంత. ఆ సముద్రంకేసి కదా కాలువలు వరదలు పయనిస్తాయి. అరిషడ్వర్గాలు భక్తుని పీడిస్తాయి. ఒక సాధుజంతువయిన ఆవును ఆరు పులులు చుట్టుముట్టితే గతేంకాను? కన్నబిడ్డలు పిచ్చివారయితే తల్లిగతేంకాను? రాజు ఏలుకుంటే దాసి అయినా రంభ కదా! ఆలాగే పాపిని ఏలుకొంటే పరవశుడు కాడా? పరుసము తాకితే ఇనుము బంగారం కాదా? మానాభిమానాలకు నీవే ఒడయడవు. జ్ఞానులకు రాజవు. గోవింద! నీవే కాపాడాలి.

ఇవన్నీ సామాన్యులకు అర్థమయ్యే ఉపమానాలు.

కావ్యాలలో, చాటువులలో సంవాదాత్మక శ్లోకాలు, పద్యాలు కవులు వ్రాయడం సహజమే. సంవాదాత్మకాలు కూడా అనేకవిధాలు. భార్యభర్తలవి, ప్రేయసీ ప్రియులవి, సుతమాతా సంబంధివి, పండితయుగ వాగ్వివాద



సంబంధివి, దాస అధికార సంబంధివి ఎన్నోరకాలు. రుక్మిణీసత్యభామా సంవాదం, సవతుల మధ్య సంవాదం ప్రధానంగా సాగిన రచన ఇది. ఒక సన్యాసి అందులోనూ బాల్యంలోనే సన్యాసం స్వీకరించిన లక్ష్మీనారాయణ తీర్థులు (శ్రీపాదరాయలు) ఒక కుటుంబంలోని సంవాదాన్ని వర్ణించడం స్థూలదృష్టికి వింత కావచ్చు గానీ మఠాధిపతులయినా తనకాలంనాటి మన్నీడుల వ్యవహారాలు అతనికి తెలియ వనడం సరికాదు. ఇంతేకాక సత్యాంశ ప్రతిపాదక మార్గాలలో హాస్యం కూడా జోడించి పరమార్థం చెప్పడం ఒక కవితామార్గం. అంతేకాదు సాంఘికవ్యవస్థలో ఇలాంటివి సహజం కనుక భర్తలయినవారు కయ్యాలవారిని సముదాయించాలనే సూచనను యతివర్యులు తెలియజేశారు.

## 3.1. కీర్తనలలో సంవాదాత్మక రచన

స్థూలంగా ఇది రుక్మిణీసత్యభామల సంవాదం. రుక్మిణి పట్టమహిషి. సత్యభామాదులు సామాన్య దేవేరులే. ఏదో ఒక సందర్భంలో వీరిరువురు కలుసుకొన్నారేమో. అంతవరకు వారి అంతరాంతరాలలో మనసులో అణగిన ఉక్రోషాలు వాగ్రూపంలో వెలువడ్డాయి.

**కంజనేత్రె శుభ మంజుళగాత్ర**
**కుంజరదంతె గమనె రంజితాంగి నిరంజనాంగి**

**ధరయె మ్యాలె హిరయళు నా**
**నిరలు లజ్జె తొరెదు నీను**
**సరస వాడోరె మురహరన**
**కరెదు భామిని సుగుణె కామిని**

**పతియ ప్రీతి ఎన్న మ్యాలె**
**అతిశయది ఇరలు జ్యేష్ఠ**

సతి యళేనే నీను నోడు
మతియ రుగ్మిణి సుపద్మగంధిని

ఒందు కాలదల్లి దాసి
యింద పతియు సరసవాడలు
బందళేనే అరసి సమ
ళెందు భామిని సుగుణె కామిని

దాసి సమళు నాను అల్ల
దోష మాతనాడబేడ
శ్రీశన దయారాశి ఇరలు
దాసియె రుగ్మిణి సుపద్మగంధిని

సారె కృత్యవారె మాడి
ద్వారకావతి యింద ఎన్న
సారె బంద ప్రీతియు ఆ
వారె భామిని సుగుణె కామిని

కడలశాయి తడెదరిన్ను
దిడుగు దేహ బిడువెనెంబో
నుడియ కేళి పిడిదనె
బిడదె రుగ్మిణి సుపద్మగంధిని

మంధరధరను ప్రీతి
యింద నిన్న పడెదనేనె
ఒందు మణియ కారణది
బందె భామిని సుగుణె కామిని



సుమ్మనె బందవళిగె
బ్రహ్మాలగ్నది బందెనగె
సామ్యవేనె యాకె నినగె
హెమ్మె రుగ్మిణి సుపద్మగంధిని

మానాది భక్తియు కన్యా
దానవు లోకదొళగుంటు
ఏను నిన్న తాతకొట్ట
దీనభామిని సుగుణె కామిని

ఎన్న హంగదెందు ప్ర
సన్న కేళి శతధన్వన
బెన్నట్టి కొందనె నీ
చన్న రుగ్మిణి సుపద్మగంధిని

వీర అరసర స్వభావ
చోరర కొల్లబేకెంబో
సారప్రీతియదరింద
తోరె భామిని సుగుణె కామిని

ఇంద్రాది దేవతెగళొళు
సాంద్రయుద్ధవన్నె మాడి
వీంద్ర(గ) ఎనగె పారిజాత
తంద రుగ్మిణి సుపద్మగంధిని

వరదరంగె కరదొళెన్న
సురుపుష్పవిరలు నిన్న

**త్వరె క్లేశ నోడి తంద**
**తరువ భామిని సుగుణె కామిని**

**నిజళెందు రంగను ఎన్న**
**విజయయాత్రెయల్లి తన్న**
**భుజగళిందాలింగిసిద**
**సుజనె రుగ్మిణి సుపద్మగంధిని**

**అరసరస్వభావ తమ్మ**
**అరసేర మనెయొళగిట్టు**
**సరస దాసీ రెంద్వొ గోదు**
**స్మరిసె భామిని సుగుణెకామిని**

**సారవచన కేళి భామె**
**మోరె కెళగె మాదుతిరలు**
**నారి రుగ్మిణి భామెయరన్ను**
**వీర కరెదను తాసేరి మెరెదను**

**మంగళాంగ మహిమ కేశవా**
**లింగసిద భైష్మియన్ను**
**తుంగగుణ గోపీరమణ**
**రంగవిఠలను అనంగజనకను**

ఎదుటి వ్యక్తి తనకు నచ్చకపోతే పరిచయంతో పొగుడుతూ పరిహాసం చేయడం సహజం.

**రుక్మిణి:** ఓ భామిని! సుగుణకామిని! నేనేగా దేవేరులలో పెద్దదాన్ని. ఇది అందరికి తెలిసిన విషయం. నీకూ ఈ సంగతి తెలుసు. అయినా తెలిసి తెలిసి నా మగడు మురహరునితో సరసమాడతావేమిటి? సిగ్గుండక్కర్లే!



**సత్య:** ఓ రుక్మిణి! సుపద్మగంధిని! (రుక్మిణి సత్యభామ అని పేరెట్టి పిలువలేదు. సుగుణకామిని అంది. అది ఆవిడ పెద్దరికం. కాని సత్యకు ఆ కనీస మర్యాదలు కూడా లేవు.) నీవు పెద్దదానివి కావచ్చు. జ్యేష్ఠవు (వెక్కిరింపు) నామీదే కృష్ణునికి ప్రీతి. ఆ కారణాన నాతో సరసమాడతాడు. ఇప్పటికయినా తెలుసుకో!

**రుక్మిణి:** సుగుణకామిని! రాజులకు దేవేరులని, దాసీజనమని తేడా లేదు. ఆ కారణాన రాజులు అవసరమయితే వారితోను సరసమాడ వచ్చులే. పట్టమహిషికి ఇతరులందరు దాసీలే. ఈ సంగతి నీకు తెలియదా! తెలుసుకో ఇకనయినా. ఏదో ఒకసారి సరసాలాడినంత మాత్రంచేత దాసి సర్వశ్రేష్ఠు రాలవుతుందా?

**సత్య:** నేను దాసినా? చాల్లే! నన్ను రెచ్చగొట్టకు. శ్రీశుని దయారాశి నా మీదనే! తెలుసుకో! నేను దాసి ఎట్లవుతానే?

**రుక్మి:** నాకోసం 'కృత్య' ప్రయోగించి నన్ను సంప్రీతితో ద్వారకకు తెచ్చాడే. ఇదంతా నాకోసమే తెలుసుకోవే?

**సత్య:** చాల్లే! అసలు సంగతి చెప్పనా! కుండిన నగరం చేరుకోవడంలో ఆలస్య మయితే నీవు తొందరపడి ఎక్కడ దేహత్యాగం చేస్తావో అని దయతో వచ్చాడే! అది స్వామి కరుణాస్వభావం.

**రుక్మి:** మంధరధరుడు నన్ను ప్రీతితో ఏలుకొన్నాడే! నిన్ను ఆలా ఏలుకోలేదుగా! ఒక అనర్ఘమణికోసం నిన్ను ఏలుకొన్నాడు. నీ విలువ మణికి కూడా సాటిరాదులేవే!

**సత్య:** నన్ను సలక్షణంగా బ్రహ్మలగ్నంలో వివాహమాడినాడే. నిన్ను అలా కాదే. కేవలం తోడుకొని వచ్చాడే. నేను శుభలగ్నంలో పెళ్ళాడి దేవేరిని అయ్యానే.

**రుక్మి:** చాల్లే. క్షత్రియవిహితమయిన అష్టవిధవివాహాలు తెలియక మాట్లాడు తున్నావే. నీ కన్యాదానం సంగతి లోకంలో అందరికి తెలుసులే. ఏమిటే నీ తాత నిన్నిచ్చాడా?

**సత్య:** ఏమిటే తెలియక వాగుతున్నావ్? శతధన్వుని చంపి నన్ను పెళ్ళాడినాడే!

**రుక్మి:** చెప్పొచ్చావులే! అది వీరుల స్వభావం. సత్రాజిత్తును చంపాడు కనుక శతధన్వుని చంపాడులే.

**సత్య:** ఇంద్రాదిదేవతలతో యుద్ధంచేసి నా కోసం స్వర్గం నుండి పారిజాత వృక్షం పెకలించి తెచ్చాడే.

**రుక్మి:** అలాగా! నా చేతిలోని పారిజాతాన్ని చూచి నీ అక్కసు భరించలేక తెచ్చి యిచ్చాడు గాని మరేంకాదు తెలుసుకోవే!

**సత్య:** నరకాసురసంహారంలో విజయయాత్రలో సాయపడితే నా శౌర్యపరాక్రమాలు చూసి నన్ను హత్తుకొన్నాడే తెలుసా!

**రుక్మి:** అభిమానవతులయిన రాజులు రాణులను అంతఃపురంలో ఉంచి తాము సమరానికి వెళతారు. నీవు రాణివి కాదేమో? దాసురాలివి కదా! అంచేత నిన్ను వెంట బెట్టకొని వెళ్ళాడు కామోసు!

సత్యారుక్మిణులు ఇలా తగవులాడుకొంటూ ఉంటే కృష్ణుడు వారిని కౌగిలించుకొని వారి కయ్యానికి స్వస్తి చెప్పాడు.

మరొక కీర్తన – ఇరువురి సఖులమధ్య సాగిన సంవాదం. శివుని గురించిన చర్చ ఇందులోని ప్రధానంశం. ఈ సంవాదంలో తెలియని ఎత్తిపొడుపు ఉంది.



**వృషభ నేరిద విషధరన్యారె పేళమ్మయ్య**

**హసుళె పార్వతియ తపసిగె మెచ్చిద ॥పల్లవి॥**

**జటామండలధారి కాణమ్మ ॥అనుపల్లవి॥**

**కైలాసగిరియ దొరెయవనమ్మ**
**అదు అల్లదె కేళె**
**బైలు స్మశానది మనెయివగమ్మ**
**సంకర్షణనెందు కేళె మహియొళు జనపొగళువరమ్మ ఇదు నైజవమ్మ**
**1**

**నాలిగె సాసిరె ఫణిభూషణ నమ్మ**
**రమెయరసన ఇవ మొమ్మగనమ్మ**
**బాలె! దాక్షాయణి పతి ఇవనమ్మ**
**మావనయాగదలి బ్యాళా కృత్యగళను నడిసెదవమ్మ 2**

**సాగరదలి హుట్టిద కాళకుటవ భక్షిసిదనమ్మ**
**రామన దయ వమ్మ**
**మెలె ఉళియలు శేషగరళవు**
**నీలకంఠనెందె నిసిద నమ్మ! 3**

ఎద్దెక్కిన విషధరుడెవరే చెప్పమ్మా!

పార్వతి తపసుకు మెచ్చి వెంటనే సాక్షాత్కరించిన జటామండలధారి. బాగా చూడు! కైలాసగిరికి దొరయంట! అంతేకాదు. స్మశానవాసమట! సంకర్షణ నాముడట! అని జనులు పొగడుతున్నారట! వేయినాల్కల తలలుగల ఆదిశేషుని భూషణంగా ధరించిన వాడట! రమాధిపతి మనుమడట!

చాలా! విను! దాక్షాయణీపతి ఇతడే! మామ దక్షప్రజాపతి చేపట్టిన యాగంలో చాలా రభసచేసిన వాడమ్మా! సముద్రమథనంలో పుట్టిన హాలాహల విషాన్ని మింగిన వాడమ్మా! రామునిదయతో విషం మింగినా విషభక్షణంనుండి నివృత్తుడయిన నీలకంఠుడమ్మా!

ఇది పొగడ్త – ఎత్తి పొడుపులతోడి సంవాదం. స్త్రీల స్వాభావిక మనస్తత్వానికి ప్రతీక.

ఇలాగే మరో చమత్కారాత్మక కీర్తన.

**"నీ నే బల్లిదనో రంగా!**
**నిన్న దాసరో బల్లిదరో...**

నీవు సమర్థుడవా! నీ దాసులు సమర్థులా! ఎన్ని రకాలుగా ఆరా తీసినా నీవు భక్తులకు అధీనుడవని తెలిసిందిలే!

నీవు పరమపురుషుడివి. శ్రుతి గోచరుడివి. వేద ప్రశంసితుడివి. అయితేనేం? సామాన్యుడయిన ధర్మరాజు పిలిస్తే రాజసూయానికి వెళ్ళావు. దేవేంద్రులు నీ కృపకోసం సదా వేచి ఉంటారు. అయినా నీవు పార్థునికి సారథివయ్యావు.

నీవు బ్రహ్మాండాధిపతివి. అయితేనేం? పరుల ఇంటి వాకిలి కాచావు. చక్రం చేపట్టనని ప్రతిన చేసి కురుక్షేత్రసంగ్రామంలో భీష్ముని చంపడానికి చక్రం చేపట్టావు. ఒక సామాన్య బాలుడు అంతగా పరితపిస్తుంటే వెంటనే కంబంలో సాక్షాత్కరించావు. ఆలోచిస్తే నీ భక్తులే అధికులు. నిన్ను ఎలా లోగొనాలో తెలిసిన సమర్థులు.

ప్రజానీకం అనేకరకాలవారు. వారికి కోరికలు సహజం. ఆ కోరికలు తీర్చేవారి దగ్గరికి లోకులు వెళతారు. కాని ఒకవేళ తీర్చకపోతే ముందు ప్రాధేయ పడతారు. ఆపైన బెదరిస్తారు.



**'వాసుదేవ నిన్న మర్మ కర్మంగళ**
**దేశ దేశదల్లి ప్రకటిసవో'** – అని బెదరించారు.

'వాసుదేవ! నా మదిలో తిరంగా నిలిస్తే సరి. నీ మర్మకర్మలంతా నాకు బాగా తెలుసు. నీ గురించి దేశదేశాలలో ప్రచారం చేస్తాను. నీ పరువు పోతుంది సుమా!

'కృష్ణా! పశువుల కాపరితనానికి పోయి సామాన్య గోపకులతో కలిసి తిన్నావు. ఆ ఇల్లూ ఈ ఇల్లంటూ కన్నవారింట వెన్న దొంగలించావు. ఏడురోజులు పర్వతం అవలీలగా మోచి ఆకాశం అందేదాక పెరిగావు. కాసంత అటుకులిస్తే కుచేలునికి సంపదలిచ్చావు. మగువకు సమాధానం చెప్పలేక పారిజాతం కోసం అమరావతికి పరుగులెత్తావు. నిన్ను కోరి వచ్చిన అందగత్తె ప్రాణం తీశావు. నరకాసురుని చెరలోని స్త్రీలను పెండ్లాడినావు. పైగా ఇందాక చెప్పినవి చాలావరకు 'హుందాతనం' ఉన్నవారు చేయదగ్గవి కావు. కొన్ని పిల్లచేష్టలు, కొన్ని అనాగరక చేష్టలు అంటూ చివర శరణాగతులను రక్షించే పరమదయాళుడవు. అందరితో చెప్పనా' అని ముగించడం చాలా బాగుంది.

### 3.2. 'భ్రమరగీతె'లో కవితాంశాలు

కవులు ప్రసిద్ధ గ్రంథాలలోని కథలను స్వీకరించినా సన్నివేశాలలో మార్పులు చేయడం సహజం. మూలంకంటే ఆ మార్పులు రమ్యమయితే సహృదయులు వాటికి ఆమోదం తెలుపుతారు. ఇలాంటిదే భ్రమరగీతె.

'భ్రమరగీతె' శ్రీపాదరాయల రచనలలో 76 పంక్తుల ఒక కృతి. ఈ కృతికి మూలం భాగవతం దశమస్కంధం. అయినా శ్రీపాదరాయలు మూలంలోని ఉద్ధవుని పాత్రను పక్కకు పెట్టారు. గోపికలందరు విచారగ్రస్తలయి ఉండగా అపుడే ఎగురుకొంటూ వచ్చిన 'భ్రమరాన్ని' చూచి

ఆ తుమ్మెదను కృష్ణదూతగా భావించి తమకోసం కృష్ణుడు పంపాడని ఆ తుమ్మెదతో తమ విరహాన్ని, బాధల్ని, ఆర్తిని ఏకరువు పెట్టుకోవడం ఈ ఖండికలోని ప్రత్యేకత. మొదట కన్నయ్య క్షేమవార్తలు అడగి ఆపై కృష్ణుని నిందిచడం మొదలెట్టారు. తమ్ము స్నేహమనే నావలో ఉంచి నట్టనడిసంద్రంలో వదలిపెట్టడమేమిటని? బాధ వ్యక్తం చేశారు. జింకలు వేటగాని వాద్యనాదానికి సొమ్మసిల్లి బంధింపబడినట్లు కృష్ణప్రేమకు బందీలయినామని వగచారు. అలాగే యశోదాదుల అనుమతితో కృష్ణుడు మధురకు వెళ్ళాడేమో అని సంశయం వ్యక్తం చేశారు. కన్నయ్యతో గడపిన క్షణాలు గుర్తుంచుకొని తమ విరహాన్ని ప్రకటించారు. ఆపైన తమకూ కృష్ణునికి గల అంతరాన్ని వ్యక్తం చేశారు. ఆ ఆంతర్యం స్పష్టం చేసిన భ్రమరగీతెలోని కొన్ని పంక్తులు –

**'లక్షుమి రమణనవ సూక్షుమ గొల్లతే రావు**
**కుక్షియొళు బొమ్మాండవవగె మక్షి కగళం తిప్పేవు**
**మోక్షధరసను ఆవ గోక్షీరద తృప్తరావు'**

'అతడు లక్ష్మీరమణుడు. మేము గొల్లలం
అతని కడుపులో బ్రహ్మాండాలు. మేము దోమలం
అతడు మోక్షప్రదాత. మేము ఆవుపాలతో తృప్తిపడేవాళ్ళం.'

### 3.3. ఇతరములు

శ్రీపాదరాయల 'ఉయ్యాలపాటలో' కవితాంశ కనిపిస్తుంది.

**భూమియ చిన్నద తొట్టిలమాడి**
**సోమసూర్య రెంబ కలశవ హాడి**
**నేమది వేదగళ సరపణి మాడి**
**ఆ మహాకాశకెక్క కొండిగళహాకి**



'భూమి ఉయ్యాలతొట్టి. సోమసూర్యులు కలశాలు. వేదాలు సరపణులు. ఆకాశానికి 'కొండి' వేసి ఊపండి' అని అభిప్రాయం. ఈ పదాలలో రూపకం స్పష్టం.

ఇవేగాక శ్రీపాదరాయలు సరళమయిన వ్యావహారికంలో జానపదుల మనస్తత్వాలను చాలాచోట్ల వ్యక్తీకరించారు. శ్రీపాదరాయల కీర్తనలు సమస్తం లభ్యమయి ఉంటే వాటిలోని ఇతర కవితాంశాలు తెలుసుకోవడానికి వీలుండేది.

## 4. శ్రీపాదరాయల కీర్తనలలో సందేశాలు

శ్రీపాదరాయలు మఠాధిపతులు. ద్వైతమత సంప్రదాయవాదులు. అసామాన్య పండితులు. ఇతర హరిదాసులలాగా జనులతో తిరిగినవారు కారు. తమ దృష్టికి వచ్చిన అంశాలలోని చెడునుమాత్రం గర్హించినవారు. తమ అభిప్రాయాలను సందేశాలుగా ప్రకటించినవారు. వాటిలో సన్యాసులపై చురక, వైష్ణవులకు సందేశం, లౌకికజీవనం లోని వారికి హెచ్చరికలు ప్రధానమయినవి.

### 4.1. సన్యాసులపై చురక

శ్రీపాదరాయలకాలంలో శైవం, వైష్ణవం రెండూ బలంగా ఉన్నాయి. వైష్ణవంలో శ్రీవైష్ణవం రాజాశ్రయంతో బహు భోగభాగ్యాదులనుభవిస్తున్న కాలం. వీటిని సునిశితంగా పరిశీలించిన శ్రీపాదరాయలు సర్వసంగ పరిత్యాగులయి, సామాజికచింతనైకమతులయి ఉండి కూడా రాజాశ్రయం కోరడం, ఆ ఆశ్రయంకోసం వారు పడే తిప్పలు, ఆశ్రయం దక్కాక నిలుపుకోవడానికి పడే తాపత్రయాలు గుర్తించి అసహ్యించుకొన్నారు. ఆ అసహ్యాన్ని పరోక్షంగా భగవంతునికే నివేదించు కొన్నారు.

**'ఆగబేకు రాజభోగ గళెనగెందు**
**ఈగ నాను బేడబందుదిల్ల**
**నాగశయన! రంగవిఠల! నా నిన్న**
**బాగిల కాయువ భాగ్య సాకెందరె'**

(రాజభోగభాగ్యాలు నాకు సమకూరాలని నేను ఈ వేళ కోరుకోవడానికి రాలేదు. నాగశయన! రంగవిఠల! నీ 'వాకిలి కాపలా' కాచే కైంకర్యం ఒకటి నాకు చాలు.)

## 4.2. వైష్ణవులకు సందేశం

**'విష్ణోరిదం వైష్ణవమ్'**. మహావిష్ణువు ప్రాధాన్యంగా వెలసిన మతం వైష్ణవం. ఈ మతాన్ని స్వీకరించినవారంతా వైష్ణవులే. అయితే వీరందరు బాహ్యవైష్ణవులు. నిజమయిన వైష్ణవులు కాదు. అసలు వైష్ణవులు ఏలా ఉంటారో? ఏలా ఉండాలో? భంగ్యంతరంగా శ్రీపాదరాయలు

**'సుమ్మనె వైష్ణవ నెంబిరి పర**
**బ్రహ్మ సుజ్ఞానవనరియద మనుజన్మ'**

కీర్తనలో వర్ణించారు. ఆధ్యాత్మికాంశాల చర్చను పక్కకుపెట్టి 'ఊరూరి కథలను ఏకరువు పెట్టానా? మెప్పుకోసమై నారాయణ! కృష్ణా! శరణు అన్నానా? ఆడవారి మాటలకు మరులుగొన్నాను గాని ఆర్యుల మాటలకు పరవశించినానా? మొగం కడుక్కొని నామాలు ఇతరుల దృష్టిలో పడేటట్లు పెద్దగా దిద్దుకొన్నానుగాని, పరమపావనుల శాస్త్రాలను కనీసం అవలోకనం చేశానా? మొగం సొబగులకు, అందచందాలకు మనసా కర్మణా శ్రద్ధతీసుకొన్నాను గానీ భక్తిరసప్రవాహంలో మునిగానా? అని వర్ణించారు. మహాత్ములు చాలా అంశాలను తమకు అన్వయించు కొని హితబోధ చేస్తారు.



## 4.3. భంగ్యంతర సందేశం

మఠాధిపతులన్నాక భక్తజనులు సేవించడం సహజం. అవసరమయితే వారితో లౌకికాంశాలను ఏకరువు పెట్టుకోవడం సహజం. కొందరయితే లౌకికజిజ్ఞాసే పరమార్థంగా మఠాధిపతుల దగ్గరికి రావడం కూడా సహజమే. ఆలాంటివారిని మనసులో భావించి భగవంతునితో శ్రీపాదరాయలు విన్నపం చేశారు. ఈ విన్నపాలు సామాన్యులకే.

కొందరు సాంసారికసుఖమే చాలనుకొనేవారు. దైవసాన్నిధ్యంలో ఆ విన్నపాలే చేసుకొంటారు. ఆలాంటివారిని చూచి

**'సతిసుతరుగళ సహితనాగి నా**
**హితదింద ఇరబేకెంబోదిల్ల'**

'భార్యాబిడ్డలతో నేను బాగుంటే చాలని కోరుకోవడం లేదు. భక్తులయిన వారు విషయ లంపటం విసర్జించి స్వామి కథామృతం సేవించే భాగ్యం కోరుకోండి' అని హితం పలికారు.

'ఆలాగే అప్పుల వాణ్ణయ్యాను. నాకు జీతం చాలడం లేదు. నాకు ఆర్థిక ఔన్నత్యం ప్రసాదించు అని కోరడం లేదు' అంటూ ప్రార్థించే వారంతా తమ 'నాలుకలపై హరినామోచ్చారణ' సదా పలకాలని కోరుకోవాలన్నారు.

'నగలు లేవు. ఇతరుల దృష్టిలోపడే తళతళలాడే ఒడ్యాణాలు లేవు. సమాజంలో గౌరవం లేదు' అనే వారందరు స్వామిపాదాలకు చిత్తశుద్ధితో నమస్కరించాలని పరోక్షంగా సూచించారు.

## 4.4. సూటిగా సందేశం

శ్రీపాదరాయలు మఠాధిపతులయినా తన సంకీర్తనలలో చాలచోట్ల లౌకిక జీవన వర్తనులకు సూటిగానే సందేశాలిచ్చారు. వాటిలో ప్రధానమయినవి హరిస్మరణ ప్రాధాన్యం, సాంసారిక జీవనంపట్ల జాగ్రత్తలు.

ముక్తి చతుర్విధపురుషార్థాలలో చివరిది. ఇదే జీవకోటికి ప్రధానం. ప్రాణులు కోరుకోదగింది ఇదే. అయితే ఈ ముక్తికోరేవారు ఎందరున్నా ముక్తి కాంక్షాపరులకు సందేశమిచ్చిన వారు అరుదు. శ్రీపాదరాయలు సరళమయిన భాషలో

**'భక్తి బేకు విరక్తి బేకు సర్వ**
**శక్తి బేకు ముందె ముక్తియ బయసువరిగె'** అన్నారు.

ముక్తిని కాంక్షించేవారికి భక్తి అవసరం. విరక్తీ అవసరం. సర్వశక్తులు (ముక్తిసాధన ప్రయత్నంలో అవరోధాలు ఎదుర్కొనే చిత్తస్థైర్యం) అవసరం అన్నారు. వాటితోబాటు సాంసారిక జీవనం ఏలాగుండాలో కూడా చెబుతూ –

**'సతి అనుకూల బేకు సుతనల్లి గుణబేకు**
**మతివంతనాగ బేకు మత ఒందాగిర బేకు'**

'భార్య అనుకూలవతిగా ఉండాలి. కొడుకు గుణవంతుడయి ఉండాలి. ఆ కుమారుడు బుద్ధిశాలిగా ఉండాలి. కుటుంబంలోని వారందరి అభిప్రాయాలు భిన్నభిన్నంగా ఉండకుండా ఒకరీతిగా ఉండాలి' అన్నారు.

ముక్తిసాధనకు – కర్మనిష్ఠ, జపాదులలో జాగ్రత్త, తపస్సులో నిష్ఠాపాలనం, ఉపవాసవ్రతాదులలో అనుష్ఠానశీలత చాల అవసరం. అన్నిటికన్నా 'ఉపశాంతి' తప్పనిసరి. సదా మనసా సజ్జనసాంగత్యాన్ని కోరుకోవాలి. దుస్సాంగత్యం వదిలించు కోవాలి. అంతేకాదు రంగవిఠలుని నమ్మాలి' అన్నారు.

## 4.5. సామాన్యులకు సందేశం

మఠాధిపతుల దగ్గరకు విజ్ఞులు, మధ్యతరగతివారు, సామాన్యులు వస్తూ ఉంటారు. వారివారికి తగినరీతిలో బోధచేయడం అవసరం. కొన్ని



నీతులు వ్యక్తులకు తెలిసినా, పెద్దవారి నోట వింటే విశ్వాసం పెరుగుతుంది. ఈ దృష్టితో శ్రీపాదరాయలు సామాన్యులకు సందేశం ఇచ్చారు. అలాంటివాటిలో ఒకటి –

**ఉంటాద కాలక్కె నెంటరు ఇష్టరు**
**బంటరాగి బాగల కాయ్వరు**
**ఉంటావతన తప్ప బడతన బందరె**
**ఒంటెయంతె గోణమేలెత్తువరు**

**ఉంటాగి ఉడువాగ కొంబాగ కొడువాగ**
**బెంబలిదలి నలినలివుతిహరు**
**బెంబల తప్ప బడతన బందరె**
**ఇంబునినగిల్ల నడె యెంబెరు**

కలిమి కలిగినవేళ మనతో తిరిగేవారి పరిస్థితి, లేమిలో వారు వ్యవహరించే తీరును వర్ణించిన తీరు మనోహరం. కలిమిగల కాలంలో బంధువులు ఇష్టులు. తాము కలవారికి సేవకులుగా వాకిట కాచేవారవుతారు. కలిమి సెలవు పుచ్చుకొంటే ఒంటెలా 'బిచాన' ఎత్తిపడేస్తారు.

## 4.6. సందేహ నివృత్తి

పామరులకు చాలా సందేహాలుంటాయి. ప్రత్యేకించి ఆధ్యాత్మికాంశాలలో. ఆ సందేహాల నివృత్తి చేయడం ఆధ్యాత్మికుల కర్తవ్యం. ప్రత్యేకించి మఠాధిపతు లది. ఆ కారణాన శ్రీపాదరాయలు తన సంకీర్తనలలో పామరుల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రయత్నించారు.

పామరుల సందేహాలలో శివుడు గొప్పవాడా? విష్ణువు గొప్పవాడా? అన్నది ఒకటి. వీరశైవులు శివునికే ప్రాధాన్యమిచ్చారు. కర్ణాటకంలో వీరశైవానికి వ్యాప్తి. ఆ కారణాన శ్రీపాదరాయలు తనదయిన అభిప్రాయాన్ని –

**'బిడిబిడి సందేహవను పొడవి మనుజరెల్ల**
**ఒడెయ నొబ్బనె జగకె రంగవిఠల'**

విడిచిపెట్టండి! విడిచిపెట్టండి! మీ సందేహాన్ని. భూలోకవాసులారా! ఈ మానవాళికి ఒడయడు రంగవిఠలుడే! అని తేల్చి చెప్పాడు. ఈ నిర్ణయం కోసం భృగువు చేసిన బ్రహ్మ హరి హరుల పరీక్షను రమ్యంగా చిత్రీకరించారు.

## 4.7. మతసందేశం

శ్రీపాదరాయలు ద్వైతమతానుయాయులు. అంచేత వారు ద్వైతమతం గురించి కొన్ని కీర్తనలలో తమ అభిప్రాయం ప్రకటించారు. మధ్వశాస్త్ర పరిజ్ఞానమవసర మన్నారు. ఇందుకు బలంగా ఆలంకారికంగా 'పాలు సంస్కారంలేక (తోడు పెట్టక) పెరుగువుతుందా?, సూరిజనుల సహవాసం లేకపోతే వైరాగ్య భాగ్యమందుతుందా? ఉపదేశంలేని మంత్రాలకు ఫలితమా?' అని ప్రశ్నించారు.

ఆధ్యాత్మికరంగంలో ఆచార్యపురుషులకు ఎంతటి ఉన్నతస్థానముందో అలాగే తీర్థపాదులకూ గౌరవముంది. ఈ అభిప్రాయాన్ని శ్రీపాదరాయలు **'వ్యర్థవల్లవె జన్మ వ్యర్థవల్లవె'** కీర్తనలో దృష్టాంతాలతో విశదీకరించారు.

అరుణోదయకాలాన లేచి ప్రవాహంలో స్నానంచేసి మల్లెమొగ్గను మాత్రం హరికి అర్పించే మనుజుడే మనుజుడు? శంఖోదకంతో అభిషేకం చేసి గంధపుష్పా దులతో అలంకరించని వాని జన్మ వ్యర్థం కదా! తులసీదళాలను భక్తిశ్రద్ధలతో తెచ్చి అర్పించి, స్తుతించని మానవజన్మ ఎందుకు? అన్నారు.

## 4.8. ఆత్మవిశ్వాసం పెంచడం

శ్రీపాదరాయల సందేశాలలో గుర్తించదగ్గది భక్తులలో ఆత్మవిశ్వాసం పెంచడం. లోకంలో కలికాలమంటే పాపభూయిష్ఠమనే అభిప్రాయముంది. కాని శ్రీపాదరాయలు



**'కలియుగకె సమ యుగవిల్లవయ్య'**

కలియుగానికి సమానమయిన యుగం లేదన్నారు. కాలుష్యనివారిణి, కైవల్య ప్రసాదిని హరినామకీర్తన. ఆ స్మరణతో సాయుజ్యం తథ్యం. సకలవరప్రదాత అయిన శ్రీరంగవిఠలుని స్మరిస్తే కలియుగవే 'కృతయుగమవుతుందయ్యా' అని ఢంకా భజాయించి చెప్పారు.

## 5. శ్రీపాదరాయల కీర్తనలలో సంగీతాంశాలు

శ్రీపాదరాయలవారు మతాధిపతులయినా వాగ్గేయకారులు. వారికి సాహిత్య మెంతో సంగీతమయినా అంతే. కారణం సాహిత్యం ఆలోచనామృతం. సంగీతం ఆపాతమధురం. అంతేగాక పూజాదికసమయాల్లో కన్నడకీర్తనలకు ప్రాధాన్య మిచ్చిన మహనీయులు. కృతయుగంలో ధ్యానానికి, త్రేతాయుగంలో యజన యజ్ఞాదులకు, ద్వాపరయుగంలో దేవతార్చనకు, కలియుగంలో గానానికి ప్రాధాన్యమని గుర్తించినవారు. ఆ కారణంవలన నరహరితీర్థుల సంప్రదాయం ప్రకారం 'కీర్తనలు' రచించారు. ఈ కీర్తనలలోని వివిధాంశాలలో కొన్నింటిని చర్చించడం ఈ ప్రకరణాంశం.

## 5.1. కీర్తన నిర్మాణం

శ్రీపాదరాయల కీర్తనలన్నిట 'పల్లవి' నియతం. పల్లవి అనుపల్లవి రెండూ కలవి తక్కువ. ఆలాగే చరణాలు మూడు నుండి 23 చరణాలవరకు గల కీర్తన లున్నాయి. ఒక్క 'రంగమనగె బారో కృపాంగ శ్రీరంగ' పాటను 23 చరణాలు న్నాయి. కన్నడానికి 'ప్రాస' ప్రధానం కనుక చరణాలలో ప్రాసనియతంగా కనిపిస్తుంది. మచ్చుకు –

**నీలఘనలీల జోజో కరుణాల**
**వాల శ్రీకృష్ణ జోజో**

**లీలావతార జోజో పరమాత్మ**

**బాలగోపాల జోజో**

ఈ చరణంలో రెండవ అక్షరం 'ల' ప్రాస స్థానంలో ఉంది.

### 5.2. అంకితపదం: (మకుటం)

చాలావరకు వాగ్గేయకారులందరు 'అంకితపద' నియమం పాటించినవారే. ఈ అంకితపదం చాలవరకు గురుదత్తం. కన్నడ వాగ్గేయకారులలో హరిదాస కూటం వారందరు 'విఠలాంత' శబ్దాలను అంకితపదాలుగా వాడారు. ఆలాగే శ్రీపాదరాయలు '**రంగవిఠల**'ను అంకితపదంగా గ్రహించారు. అరుదుగా 'పల్లవి'లో అంకితపదం ఉండవచ్చు. ఇతరత్రా చివరి చరణంలో ఉండడం ఒక సామాన్య నియమం.

'**శ్రీరంగవిఠలన శ్రీ మకుటకె శరణు**' కీర్తనలో పల్లవి ఆదిలోనే అంకితపద ముంది. ఉగాభోగాదులలో అంకితనియమం లేదు.

### 5.3. నామాంకిత కీర్తనలు

కీర్తనలకు సాధారణంగా శీర్షికలుండవు. ప్రాస్తావిక అంశంబట్టి వాడుకలోని వ్యాప్తిబట్టి ఆ శీర్షికలు ప్రచారమయి ఉండవచ్చు. శ్రీపాదరాయల కీర్తనలలో మధ్వనామ, వృత్తనామ లాంటివి శీర్షికలతో కనిపిస్తాయి.

**జయజయ జగత్రాణ జగదొళగె సుత్రాణ**

**అఖిల గుణసద్ధామ** – అన్నది మధ్వనామ అయితే

**'మాననిధి శ్రీకృష్ణ మధురెగైదువనంతె**

**ఏన పథవమ్మ నమగె'** – అన్నది వృత్తనామకం. పల్లవి, అనుపల్లవి చరణాల తరువాత శ్లోకభాగం రావడం వృత్తనామమవుతుంది.



### 5.4. రాగతాళాంశాలు

శ్రీపాదరాయలు స్వామిని 'సంగీతలోలనె' అని కీర్తించారు. ఆలాగే 'పాలిసయ్య' కీర్తనలో కృష్ణుని వేణుగానాన్ని–

**సరిగమపదనిస సనిదపమగరిస అధరదలూదుదుతిరె రంగా**

**సిరియరసను సిరిపతి రంగవిఠల సరసది వేణునాద మాడిద'** అని తనకు గల సంగీతపరిచయాన్ని చాటారు.

మైసూరు విశ్వవిద్యాలయం కన్నడ అధ్యయనసంస్థవారు 1973లో ప్రకటించిన 'శ్రీపాదరాజర కృతిగళు' అనే సంపుటంలో ప్రతికీర్తనకు రాగతాళ నిర్దేశాలున్నాయి. శ్రీపాదరాయలు కళ్యాణి, మధ్యమావతి, సావేరి, కేదారగౌళ, పూర్వి, ముఖారి, సారంగ, భైరవి, ధన్యాసి, వరాళి, ఆరభి, శుద్ధసావేరి, కాంబోజి, శంకరాభరణం, దేవగుప్తి, తోడి, శ్రీ, నాదనామక్రియ, మలయమారుతం, మాయా మాళవగౌళ, బౌళి, ఆహిరి, హిందోళ, పాడి, సురటి, దేశి, కురంజి, కాపి, మోహన, సౌరాష్ట్ర, ఆనందభైరవి, దేవగాంధారి, వసంత, నారాయణి, రేగుప్తి, నాట లలో కీర్తనలు రచించినట్లు స్పష్టం. ఆలాగే తాళాలలో ఆది, ఝంపె, ధ్రువ, మఠ్య, త్రిపుట, రూపట, అట్ట, ఏకతాళ, జతె, ఛాపు తాళాదుల ఉల్లేఖాలు కనిపిస్తున్నాయి.

### 5.5. జానపదాంశాలు

శిష్టసాహిత్యానికి జానపదసాహిత్యానికి వారధి లాంటిది పదసాహిత్యం. అందుచేత పదసాహిత్యంలో రెండు లక్షణాలూ కనబడుతున్నాయి. శ్రీపాదరాయల రచనలలో జానపదధోరణులుగలవి జోల, లాలి, మంగళం లాంటివి. లాలి పాటలో అయితే స్త్రీలు కల్యాణి, దేవగాంధారి, ఆనందభైరవి రాగాలతో పాడి నారని తమకుగల రాగజ్ఞానాన్ని విశదం చేశారు. స్త్రీలమధ్య తమ కృతులు బాగా ప్రచారం కావాలనే ఉద్దేశ్యంతో వీటిని రచించి ఉండవచ్చు.

**జోల:** జో జో జో జో జో రంగధామ
జో జో జో జో జో రణభీమ

**లాలి:** లాలి గోవింద లాలి కౌసల్యా
బాల శ్రీరామ లాలి

**మంగళం:** జయ మంగళం నిత్య శుభమంగళం
మంగళ రంగ నరసింగ ఉత్తుంగనిగె
మంగళం సింగర చిత్తాంగద హరిగె
మంగళం సింగరది కంగొళిప ముంగరుళ
కంగళి ధవళాంగ శుభాంగ హరిగె

## 5.6. ఇతరాంశాలు

శ్రీపాదరాయలు సంస్కృతకర్ణాట భాషాకోవిదులు. వారి సంస్కృత భాషా పరిచయానికి 'వాగ్వజ్ర' అనే గ్రంథం సాక్ష్యం. కన్నడ పరిచయానికి కన్నడ కీర్తనలే సాక్ష్యాలు.

శ్రీపాదరాయలు సంస్కృత కీర్తనలు వ్రాసినట్లు ఆధారాలు లేవు. కాకపోతే సంస్కృతభాష బాణిలో 'రక్షమాం రంగేశ' లాంటివి కనిపిస్తున్నాయి. అంతమాత్రాన సంస్కృతాన్ని పరిహరించారని కాదు. కన్నడకీర్తనలలో తత్సమపదభూయిష్ఠమయిన శబ్దజాలం విరివిగా కనిపించడమే అందుకు సాక్ష్యం. కాకపోతే సంగీతానికి అనుగుణంగా కొన్ని శబ్దాలు శైథిల్యరూపంలో కనిపిస్తాయి. మచ్చుకు పదుమనాభ, హరిభకుత, మూరుఖ లాంటివి.

శ్రీపాదరాయల కన్నడాన్ని కన్నడిగులు 'తిళుగన్నడ' అని వ్యవహరిస్తారు. వ్యావహారికంలోని 'యాసను' యథాతథంగా ప్రతిబింబించే రచన. మచ్చుకు ఇట్హాంగె ఇరువనో (భగవంతుడు ఎలా ఉంచితే అలా ఉంటాను), నానినగేను బేడువుదిల్ల (నేను నిన్ను ఏమీ కోరుకోను), ఇదనాదర కొడదిద్దర (ఇదయినా ఇవ్వకపోతే), చింతెయను మాడదిరా (చింతపడవద్దు) కేళిద్యా కౌతుకవన్ను కేళిద్యా (విన్నారటే ఆసక్తి కలిగించే సుద్ది విన్నావటే), ఎల్లాడి బంద్యో (ఎక్కడ ఆటలాడి వచ్చావురా!), బారో నమ్మ మనగె (రారా! మా ఇంటికి), యాకె పుట్టిసదె నీ సాకలారదె (పోషించడం ఇష్టం లేకపోతే ఎందుకు పుట్టించావు), కంగళిద్యాతాక్కో (కళ్ళుండి ప్రయోజనమేమి) మొదలయినవి.



శ్రీపాదరాయల రచనలో అరుదయిన పదాలు కొన్ని కనిపిస్తున్నాయి. పొంగణ్ణ (బంగారు కళ్ళవాడు), గన్నగార (మోసగాడు), హరవి (మచ్చకొండ), అర్థకృతస్నేహ ప్రతిఫలం కోరి చేసే స్నేహం; అధనరు (డబ్బు లేనివారు), తీర్థపాదులు (యోగులు); ధర్మమందిరం (ధర్మశాల).

శ్రీపాదరాయలు సామాన్యులకు దేవరనామగళు అర్థం కావాలనే ఉద్దేశ్యంతోనే తమకాలం నాటి పామరుల భాషలో కీర్తనలలో వాడారు. ఈనాటికీ ఈ భాష అర్థం కావడం విశేషం.

కాసంత కన్నడపరిచయమున్న వారు శ్రీపాదరాయల కీర్తనలను అలవోకగా నేర్చుకొని పాడుకోవచ్చు. ఇతరుల కీర్తనలలోని భావాలను అవగతం చేసుకొని ఆనందించవచ్చు.

**నమః శ్రీపాదరాజాయ**
**నమస్తే వ్యాసయోగినే**
**నమః పురందరార్యాయ**
**విజయార్యాయ తే నమః**

* * *

# అనుబంధం - 1

శ్రీపాదరాయల ప్రసిద్ధకీర్తనలు:

రాగం - మాధ్యమావతి తాళం - ఏకతాళ

ఇక్కోనోడె రంగనాథన చిక్కపాదవ ॥పల్లవి॥

సిక్కితె శ్రీలక్ష్మీపతియ దివ్యపాదవ ॥అనుపల్లవి॥

శంఖచక్రగదా పద్మ అంకిత పాదవ
అంకుశకలిత ధ్వజరేఖా అంకిత పాదవ
పంకజాసనన హృదయదల్లి నలియువ పాదవ
సంకటహరణ వేంకటేశన దివ్యపాదవ 1

లాలనె లక్ష్మియంకదల్లి నలియువ పాదవ
జలజాసనన అభీష్టవెల్ల సలిసువ పాదవ
మల్లర గెలిదు కంసాసురన కొంద పాదవ
బలియ మెట్టి భాగీరథియ పడెద పాదవ 2

బండెయ బాలెయ మాడిద ఉద్దండ పాదవ
బండిలిద్ద శకటాసురన ఒద్ద పాదవ
అండజ హనుమర భుజదొళుప్పువ పాదవ
కండెవె శ్రీరంగవిఠలన దివ్యపాదవ 3

రాగం - తోడి తాళం - రూపక

కంగళిద్యాతకో కావేరి రంగన నోడద ॥పల్లవి॥

జగంగళొళగె మంగళ మూరుతి
రంగన శ్రీపాదంగళ నోడద ॥అనుపల్లవి॥



ఎందిగాదరొమ్మె జనరు
బందు భూమియల్లి నిందు
చంద్రపుష్కరిణి స్నానవమాడి ఆ
నందదిందలి రంగనె నోడద 1

హరిపాదోదక సమ కావేరి
విరజానది స్నానవమాడి
పరమవైకుంఠ రంగమందిర
పరవాసుదేవన నోడద 2

హార హీర వైజయంతి
తోర ముత్తిన సరవధరిసి
తీరనేరి బీదిలి
మెరెవ రంగవిఠలన నోడద 3

రాగం - నాట తాళం - చాపు

రంగనాథన నోడువ బన్ని శ్రీ ॥పల్లవి॥

రంగన దివ్య విమానదల్లిహన ॥అనుపల్లవి॥

కమనీయగాత్రన కరుణాంతరంగన
కామితార్థ వీవ కల్పవృక్షన
కలమదళనేత్రన కస్తూరి రంగన
కామధేను కావేరి రంగన 1

వాసుకి శయనన వారిధి నిలయన
వాసుదేవ వారిజనాభన
వాసవాది భక్త హృదయాంబుజ దల్లి
వాసవాగిరుతిహ వాసుదేవసుతన 2

మంగళగాత్రన మంజుళ భాషన
గంగాజనక అజజనకన
సంగీతలోలన సాధుసమ్మతన
రంగవిఠల రాజీవనేత్రన 3

రాగం – సావేరి తాళం – త్రిపుట

రక్షమాం రంగేశ
రక్షమాం రంగేశ రవికోటి సంకాశ ॥పల్లవి॥

పక్షివాహన శ్రీశ భవ్యగుణకోశ
అక్షరాది పిపీలికాంత సం
రక్షకామయహరణ సర్వ
లక్షణ పరిపూర్ణపరమేశ! దక్షిణాధీశ ॥అనుపల్లవి॥

కమలదళనేత్ర కమలారి సమవక్త్ర
కమలావిరచిత స్తోత్ర కరధృత గోత్ర
కమలజనుతిపాత్ర కరిరాజయాత్ర
కమలధర కరకమల సమపద
కమలసంభవ సుగాత్ర కమలాకళత్ర 1

అనిమిష సుప్రీతాఖిల దోషనిర్ధూత
సనకాది శ్రుతిగీత అర్జునసూత
దినమణికులజాత దేవకీ పోత
కనకవసన కిరీటధర కో
కనదహిత కమలాప్త నయన
వనదహనవైరి కులఘాత వనజభవ తాత 2



అంగనాంబరహరణానుపమ సప్తావరణ
మంగళకరచరణ భక్తసంరక్షణ
గాంగేయకృతస్మరణ కరుణాభరణ
రంగవిఠల భుజంగశయన తు
రంగధర కావేరి తీర శ్రీ
రంగనిలయ తురంగ సంచరణ గంగాచరణ 3

రాగం – నాట తాళం – ఖండచాపు

శ్రీరంగవిఠలన శ్రీమకుటకె శరణు ॥పల్లవి॥

శిరదల్లొప్పువ నీలకుంతళకె శరణు
సిరిసహోదర నర్ధదవళిగె శరణు ॥అనుపల్లవి॥

సొంపు నోటద చెలువ సొగెకణ్ణిగె శరణు
సంపిగెయ కుసుమ సమనాసికకె శరణు
గుంపురత్నద కర్ణకుండలగళిగె శరణు
ఇంపు దర్పణనిభ కపోలగళిగె శరణు 1

కుందకుట్మల పోల్వ దంతపంక్తిగె శరణు
అందవాగిరువ బింబోష్ఠకె శరణు
చంద్రికానిభ ముద్దు మందహాసకె శరణు
నందగోపన ముద్దు కందనిగె శరణు 2

అబ్జనాభన దివ్య కంబుకంఠకె శరణు

అబ్జముఖియిరువ వక్షస్థళకె శరణు
కుబ్జెయను డొంక తిద్దిద భుజగళిగె శరణు
అబ్జాసన పెత్త నాభిగె శరణు 3

రన్నగంటె గళిరువ నిన్న కటిగె శరణు
పొన్న కదళీ పోల్వ తొడెగళిగె శరణు
పున్నాగ కరగెత్త ద్వయ నితంబకె శరణు
చెన్నాగి కుణివ సమజానువిగె శరణు 4

మంగళవైభోంగళ అంఘ్రిద్వయకె శరణు
తుంగ కుచగళ పిడిద కరగళిగె శరణు
పొంగొళలనూదువా అంగులిగళిగె శరణు
రంగవిఠలన సర్వాంగకె శరణు 5

తిరుమల కీర్తనలు:

భూషణగె భూషణ ఇదు భూషణ
శేషగిరివాస శ్రీవర వెంకటేశ ॥పల్లవి॥

నాలిగెగె భూషణ నారాయణ నామ
కాలిగె భూషణ హరియాత్రెయు
ఆలయకె భూషణ తులసివృందావన వి
శాలకర్ణకె భూషణ విష్ణుకథెయు 1

దానవే భూషణ ఇరువహస్తంగళిగె
మానవే భూషణ మానవరిగె
జ్ఞానవే భూషణ మునియోగివరరిగె
మానినిగె భూషణ పతిభక్తియు 2

రాగం – ఆనందభైరవి తాళం – ఝంపెతాళ

లాలి గోవింద లాలి కౌసల్యా
లాలి శ్రీరామ లాలి ॥పల్లవి॥



లాలి మునివంద్య లాలి జానకీ
రమణ శ్రీరామ లాలి ॥అనుపల్లవి॥

కనకరత్నగళల్లి కాల్గళనె హోడి
నాల్కువేదగళన్ను సరపణియమాడి
అనేక భూమండలవ హలగెయను మాడి
శ్రీకాంతనుయ్యాలె యను విరచిసదరు 1

పల్లవాధరెయరెల్ల ఈ శిశువు
తుల్యవర్జిత నెనుతలి
సల్లలిత గానదింద తూగిదరు
కల్యాణి రాగదింద 2

ఆనందసదనదొళగె గోపియరు
ఆనందసుతన కందు
ఆనందభరితరాగి తూగిదరు
ఆనందభైరవి యింద 3

దేవాధిదేవనెందు ఈ శిశువు
భావనాతీత నెందు
దేవగంధర్వ ర్వాడి తూగిదరు
దేవగాంధార దింద 4

నీలఘనలీల జోజో కరుణాల
వాల శ్రీకృష్ణ జోజో
లీలావతార జోజో పరమాత్మ
బాలగోపాల జోజో 5

**ఇందుధరమిత్ర జోజో శ్రీకృష్ణ**
**ఇందురవినేత్ర జోజో**
**ఇందుకులపుత్ర జోజో పరమాత్మ**
**ఇందిరారమణ జోజో** **6**

**తుంగభవగంగ జోజో పరమాత్మ**
**రంగ కృపాంగ జోజో**
**మంగళాపాంగ జోజో మోహనాంగ**
**రంగవిఠలనె జోజో** **7**

**సూచన: డా॥ జి.వరదరాజరావ్ 'శ్రీపాదరాజరకృతిగళు' గ్రంథంలో ముద్రితమైన రీతిలో కన్నడ కీర్తనలు వ్రాయబడ్డాయి.**

* * *

# అనుబంధం - 2

శ్రీపాదరాయల వారికి వ్యాసరాయలపట్ల అపరిమితమయిన శిష్యవాత్సల్యం. ఒకసారి శ్రీపాదరాయలు వ్యాసరాయలవారిని తన మఠంలో పూజాదికాలు నిర్వహించమన్నారు. వ్యాసరాయలు సరేనన్నారు. విగ్రహాలు, సాలగ్రామాలున్న సంపుటాలును ఒకటొకటే తీసి సర్దుతున్నారు. అక్కడ ఒక సంపుటం ప్రత్యేకంగా ఉండేది. దానిని మాత్రం ఎవరూ అప్పటిదాకా తీయడానికి సాహసించలేదు. కాని వ్యాసరాయలు ఆ సంపుటాన్ని చేతిలోనికి తీసుకొని చాల తేలికగా పైమూత తీశారు. అలా తీయగానే సంపుటంలోని కృష్ణుడు గోపాలుడు పిల్లనగ్రోవి ఊదడం మొదలెట్టాడు. ఈ దృశ్యాన్ని చూచిన శ్రీవ్యాసరాయలు సాలగ్రామాలను చేతబూని తాళాలుగా భావించుకొని తాను కూడా నాట్యమాడ ఆరంభించారు. చుట్టూ ఉన్న మఠాధివాసులు ఆశ్చర్యపడ్డారు. ఈ కలకలం విని శ్రీపాదరాయలు లోపలికి వచ్చారు. మనోహరమయిన దృశ్యాన్ని చూచి పులకితులయ్యారు. శ్రీపాదరాయలు రాగానే అంతవరకు మురళిని మోగించిన కృష్ణుడు స్తబ్ధుడై సంపుటంలో నిలిచాడు. అపుడు శ్రీపాదరాయలు తన శిష్యులను ప్రశంసించారు.

'వ్యాసరాయా! నాకు నదీతీరంలో దొరికిన రెండు సంపుటాలలో రెండవ సంపుటంలోని స్వామి నిన్ను అనుగ్రహించాడు. ఈ విగ్రహాన్ని మీకే ఇస్తున్నాను. పుచ్చుకోండి' అని అభయప్రదానం చేశారు. ఈ వృత్తాంతాన్ని స్పష్టంచేసిన కీర్తన -

**'పాలిసయ్య స్వామి కృష్ణపాలిసయ్య ఎన్న నీను**
**పాలిసయ్య భాగ్యవిత్తు భక్తవత్సల**
**నిత్యపూర్ణ మంగళవిత్తు నిత్యది కల్యాణవిత్తు**
**నిత్యసలహో వ్యాసమునివంద్య గోపినాథనె'**

* * *

# సహాయక సాహిత్యం


**ఆంగ్లం**

1. A History of the Dvaita school of Vedanta and its Literature - vol.1 - B. Krishnamurthy
2. History of Indian Music - P. Samba moorthy.

**కన్నడం**

1. భక్త శ్రీపాదరాజరు – హందెగురు వేదవ్యాసదాస
2. శ్రీపాదరాజర కృతిగళు – సం॥ డా॥ జి॥ వరదరాజరావ్
3. శ్రీపాదరాజర హాడుగళు – కావ్యప్రేమి
4. హరిదాససాహిత్య – ఆర్.ఎస్. పంచముఖి

**తెలుగు**

1. అన్నమయ్య – శ్రీపాదరాయలు – కె. సర్వోత్తమరావు
2. శ్రీహరిదాసవైభవం – దేసు వేంకటసుబ్బారావు


* * *